

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 429 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 8 ఏప్రిల్ 2026 | వెల : 4/-



## చొరబాటుదారులకు కాంగ్రెస్ రక్షణ!

- రాహుల్ బాబా విను- బీజేపీ అధికారంలోకి రాగానే
- దేశం నుంచి చొరబాటుదారులను వెనక్కి పంపిస్తాం
- బంగాల్, అసోం, త్రిపురల్లో చొరబాటుదారులు పెరిగేందుకు కాంగ్రెస్ సహకారం
- బీజేపీ అధికారంలోకి రాగానే వాళ్లను పంపించేస్తాం
- స్పష్టం చేసిన అమిత్ షా

2

# చర్చకు సిద్ధం

## తెలంగాణ అభివృద్ధిపై పరిశీలించుకోవచ్చు



- తెలంగాణలో కేసీఆర్‌ను ఎలా మార్చారో, కేరళంలో కూడా విజయన్‌ను మార్చేస్తారు
- కేరళం రాష్ట్రంలోని కోవలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- కేరళం సీఎం పినరయి విజయన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించిన రేవంత్ రెడ్డి
- పినరయి విజయన్ కేరళం ప్రజలను మోసం చేస్తున్నారు
- ఒక మోదీ ఢిల్లీ నుంచి పాలిస్తే మరో మోదీ తిరువనంతపురం నుంచి పాలిస్తున్నారు
- కేరళంలో విజయన్ మోదీలా పాలిస్తున్నారన్నారు
- ఓట్ల కోసం మోదీలానే విజయన్ తన పేరుతో ప్రచారం చేస్తున్నారు

హైదరాబాద్

కేరళం సీఎం పినరయి విజయన్ తన 120 నెలల పాలనలో పూర్తిగా విఫలమయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేరళంలో సరైన అవకాశాలు లేక యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కేరళంలో వృద్ధులు, చిన్నపిల్లలే ఎక్కువగా కనిపిస్తున్నారని తెలిపారు. విద్యావంతులు నైపుణ్యం కలిగిన యువత విదేశాలకు వెళ్లడం సరికాదన్న ఆయన వాళ్లు తిరిగొచ్చి ఉపాధి పొందేలా చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ మాదిరి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం లాంటివి కేరళంలో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో ఏ మూలకైనా వెళ్లి తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించవచ్చని పినరయి - మిగతా3లో

## తెలంగాణ మావోయిస్టు విముక్త ప్రాంతంగా మారింది



- తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో డీజీపీ శివధర్‌రెడ్డి పర్యటన
- వెంకటాపురం మండలం పామునూరులో పోలీస్ ఔట్ పోస్టుకు శంకుస్థాపన
- కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమన్న డీజీపీ శివధర్ రెడ్డి
- ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు అత్యంత కీలకం

హైదరాబాద్

తెలంగాణ మావోయిస్టు విముక్త ప్రాంతంగా మారిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. రాష్ట్రం నుంచి ఆరుగురు వ్యక్తులు ఉద్యమంలో ఉన్నారని, వారు కూడా బయటకు రావాలని కోరుతున్నామన్నారు. కొన్ని కారణాల వల్ల కర్రెగుట్టలు ప్రాంతం చాలా కాలం పాటు అభివృద్ధికి దూరమైందన్నారు. గూడేల్లో ఉన్నవారికి కనీస సౌక ర్యాలు అందలేదన్నారు. కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని తెలిపారు. ప్రభుత్వం తరఫునుంచి పరిశ్రమలు ఏర్పాటుకు - మిగతా3లో



## రేవంత్ రెడ్డిపై కేరళ సీఎం ఘాటు విమర్శలు

- తీవ్ర పరుష పదజాలంతో?!
- రేవంత్ రెడ్డికి కేరళ సీఎం విజయన్ కౌంటర్
- సీఎం హోదాలో అలా మాట్లాడొచ్చా అని విజయన్ ప్రశ్న

2

## బంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలుసు



- పాకిస్థాన్ రెండు భాగాలుగా విడిపోయినప్పుడు వారు పర్యవసానాలను అనుభవించారని రాజ్‌నాథ్ ఎద్దేవా
- రెండు పొరుగుదేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌కు వార్నింగ్
- "పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటన చేసి ఉండకూడదు

2

# విస్తరణ పక్కా!



- అందరి దృష్టి కేబినెట్ విస్తరణ అంశంపైనే కేంద్రీకృతమైంది.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గంలో ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారు
- ఎవరికి ఉద్వాసన పలుకుతారు అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది
- ప్రస్తుతం కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో ఈ కసరత్తు మే నెల వరకు వాయిదా పడే అవకాశాలు

హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అందరి దృష్టి కేబినెట్ విస్తరణ అంశంపైనే కేంద్రీకృతమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గంలో ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారు, ఎవరికి ఉద్వాసన పలుకుతారు అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో ఈ కసరత్తు మే నెల వరకు వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్టానం మొత్తం ఈ ఎన్నికలపైనే దృష్టి సారించడంతో తెలంగాణలో మార్పులకు ముహూర్తం ప్రస్తుతానికి దూరమైంది. - మిగతా3లో



## రేవంత్.. మళ్లీ గెలవడం కాదు.. సింగిల్ డిజిటే మీకు

- రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవ్వడం ఖాయం
- ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?
- రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన... బేడీల పాలన గుడ్డి పాలన
- సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండి.

3

## ఓటర్ల జాబితా నుంచి పేర్లను తలలో 'పేలు' మాదిరిగా ఏరిపారేశారు



- మతువా, మైనారిటీలకు చెందిన ఓట్లను ఈసీ తొలగించింది
- సుప్రీంకోర్టులో వాదనలు వినిపించడంతో 32 లక్షల పేర్లను తిరిగి జాబితాలో చేర్చింది
- బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కీలక వ్యాఖ్యలు

2



## మతవిశ్వాసం న్యాయ సమీక్షకు అతీతం

- శబరిమలలో మహిళలపై ఆంక్షలను సమర్థించిన కేంద్రం
- శబరిమలలో రుతుస్రావం అయ్యే వయసు గల మహిళల ప్రవేశంపై ఆంక్షలను సమర్థించిన కేంద్ర ప్రభుత్వం
- ఈ మేరకు సుప్రీంకోర్టును తమ వైఖరిని వెల్లడించిన సర్కార్

2



## కేరళ, పుదుచ్చేరి, అసోంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెర

- ప్రచారానికి చివరి రోజున కావడంతో అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం
- కేరళ, పుదుచ్చేరి, అసోంలో ఏప్రిల్ 9న జరగనున్న పోలింగ్
- మే 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలు
- ఏప్రిల్ 9న అసోంలో పోలింగ్ జరగనుండగా మొత్తం 126 స్థానాల్లో బరిలోకి దిగిన 722 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది

2

# బంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలుసు

కోల్‌కతాపై దాడి చేస్తామంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్?కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్ రెండు భాగాలుగా విడిపోయినప్పుడు వారు పర్యవసానాలను అనుభవించారని ఎద్దేవా చేశారు. కాబట్టి ఆయన అలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేయకూడదని సూచించారు. వారు బంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని భాగాలుగా విడిపోతుందో ఆ దేవుడికే తెలుసని వ్యాఖ్యానించారు. "పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటన చేసి ఉండకూడదు. 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్ రెండు భాగాలుగా విడిపోయినప్పుడు వారు దాని పర్యవసానాలను అనుభవించారు. వారు ఇప్పుడు బంగాల్?పై కన్నేస్తే, ఈసారి పాకిస్థాన్ ఎన్ని భాగాలుగా విడిపోతుందో దేవుడికే తెలియాలి." ఈ క్రమంలోనే 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్? రెండుగా విడిపోయిన విషయాన్ని రాజ్?నాథ్? ప్రస్తావించారు. 1971లో జరిగిన యుద్ధంలో తూర్పు పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. ఆ సమయంలో బంగ్లాదేశ్‌కు భారత సైన్యం అండగా నిలిచింది. అప్పట్లో పాక్ ఎన్నో పర్యవసానాలు ఎదుర్కొందని రాజ్‌నాథ్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా రెండు పొరుగుదేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌కు వార్నింగ్ ఇచ్చారు.

### కేంద్రంపై టీఎంసీ ఫైర్?

మరోవైపు ఈ ఘటనపై టీఎంసీ కూడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసింది. కోల్‌కతాపై దాడి చేస్తామని పాకిస్థాన్



రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ బహిరంగంగా బెదిరించడాన్ని ఖండించే ధైర్యం లేదని ఆరోపించింది. ఎన్నికల సభలో మాట్లాడిన ఎంపీ అభిషేక్ బెనర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "56 అంగుళాల ఛాతీ గల ప్రధానమంత్రి, ఆయన హోం మంత్రి ఓట్ల ప్రచారంలో ఎంతగా మునిగిపోయారంటే బంగాల్‌పై జరుగుతున్న ప్రత్యక్ష దురాక్రమణ బెదిరింపులకు స్పందించడానికి వారికి సమయం లేదు. పాకిస్థాన్ రక్షణ మంత్రి కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించారు. అయినా భారత యూనియన్‌లోని ఒక రాష్ట్రంపై, సార్వభౌమాధికారంపై జరిగిన ఈ ఘోరమైన దాడిని ఖండించే ధైర్యాన్ని నరేంద్ర మోదీకీ, అమిత్ షా గానీ లేదు. వారికి బంగాల్ ప్రజల ప్రాణాలు ఏమాత్రం లెక్కలేనట్టుగా ఉన్నాయి. వీరిద్దరు చాలా పిరికివాళ్లు. వారికి కనీసం కొద్దిపాటి ధైర్యం ఉన్నా, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్‌కు, భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనివ్వాలి. నరేంద్ర మోదీకి ఆ ధైర్యం ఉందా? అమిత్ షాకు ఆ ధైర్యం ఉందా? రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ ధైర్యం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

### పాకిస్థాన్ రక్షణ మంత్రి పిచ్చి ప్రేలాపనలు

కాగా కొద్ది రోజుల క్రితం భారత్‌పై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి నోరుపారేసుకున్నారు. భవిష్యత్తులో భారత్ ఏదైనా దాడులకు పాల్పడితే కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పిచ్చి ప్రేలాపనలు చేశారు. ప్రతిదాడులను ఆ ప్రాంతం వరకూ తీసుకెళ్తామంటూ వ్యాఖ్యానించారు. ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను పడేసి వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్లు నివేదికలు ఉన్నాయంటూ అక్కసు వెళ్లగక్కారు. అయితే, తన వాదనలకు బలం చేకూర్చేలా ఖవాజా, ఎటువంటి ఆధారాలూ ఇవ్వకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఈ హెచ్చరికలపై ఖవాజా ఇప్పటికే తన అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం ఘటన జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తమపై జరిగే దాడులను తిప్పికొడతామని ఖవాజా మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు.

# చొరబాటుదారులకు కాంగ్రెస్ రక్షణ!

అసోం ఎన్నికల ప్రచారంలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్‌పై, రాహుల్ గాంధీపై విమర్శల వర్షం కురిపించారు. అసోంను చొరబాటుదారుల ఆధిపత్య ప్రాంతంగా మారనివ్వమని ఆయన తేల్చిచెప్పారు. అసోంలోని పథర్‌కండిలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న అమిత్ షా, ప్రతిపక్షాలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రాహుల్ బాబా ఇది స్పష్టంగా విను. అసోంను చొరబాటుదారుల అడ్డాగా మారనివ్వం. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం విపక్షాలు ఇన్నాళ్లు చొరబాటుదారుల పట్ల ఉదాసీనంగా ఉన్నాయి. ఇప్పటికే చొరబాటుదారులను గుర్తించాం. బీజేపీ అధికారంలోకి రాగానే వారిని ఒక్కొక్కరిగా ఏరిపారేస్తాం."

### చొరబాటుదారులకు కాంగ్రెస్ రక్షణ!

'సీఏఏ గురించి మాట్లాడినప్పుడల్లా కాంగ్రెస్? అడ్డుకుంటోంది. కుట్రపూరితంగా ఈ ప్రాంతాన్ని చొరబాటుదారుల జోన్‌గా మార్చాలని వారు చూశారు. 1950 నాటి వలసదారుల బహిష్కరణ చట్టాన్ని రద్దు చేసి, 1983లో ఐఎండీటీ చట్టాన్ని తీసుకువచ్చారు. తద్వారా చొరబాటుదారులకు రక్షణ కల్పించారు. అసోం, బంగాల్, త్రిపురల్లో బీజేపీ–ఎన్?డీఏ ప్రభుత్వాలు ఉంటేనే ఈ అక్రమ చొరబాటులు పూర్తిగా ఆగుతాయి. తద్వారా స్థానికులకు ఉద్యోగాలు, రేషన్?, జీవనోపాధి కలుగుతాయి' అని అమిత్? షా అన్నారు.

### మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలపై ఆగ్రహం

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇటీవల గుజరాత్‌ను నిరక్షరాస్యుల ప్రాంతంగా అభివర్ణించడాన్ని



అమిత్ షా తీవ్రంగా ఖండించారు. "దయానంద సరస్వతి, మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభ బాయి పటేల్?, విక్రమ్ సారాభాయ్, ప్రధాని నరేంద్ర మోదీ లాంటి మహానుభావులను అందించిన గుజరాత్?ను నిరక్షరాస్యులని పిలవడానికి మీకు ఎంత ధైర్యం? ఇలా అన్నందుకు కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాలి" అని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే 'ఆర్?ఎస్?ఎస్?ను, బీజేపీలను పాములు అని, వాటిని చంపాలి' అని ఖర్గే చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. 'ఖర్గే, ఈ వేదికపై వచ్చి చుట్టూ చూడండి. వేలాది మంది బీజేపీ, ఆర్?ఎస్?ఎస్? సభ్యులు మీ ముందే ఉంటారు' అని పేర్కొన్నారు. మరోవైపు రాహుల్ గాంధీ కాంగ్రెస్ నాయకత్వం చేపట్టినప్పటి నుంచి, ఆ పార్టీ నేతల బహిరంగ ప్రసంగాలు, ప్రమాణాలు పడిపోయాయని షా అన్నారు.

### బంగాల్‌లో పరివర్తన ఖాయం

ఇక బంగాల్‌లో ఈసారి 'పరివర్తన' (మార్పు) అనివార్యమని అమిత్ షా పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే, చొరబాటుదారులందరినీ, వారి దేశాలకు తిరిగి పంపిస్తామని ఆయన ప్రకటించారు. అసోంలోని పాతార్?కండిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అసోం బరాక్? వ్యాలీలో కాంగ్రెస్ అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించిందని, తద్వారా శ్రీభూమి, సిల్చార్?, కాచార్ జిల్లాలలో వారి ప్రాబల్యం పెరిగేలా చేసిందని ఆయన ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలులోకి వస్తే, అక్రమ చొరబాటుదారులు ఎవ్వరూ రాష్ట్రంలో ఉండలేరని తెలిసి, కాంగ్రెస్ దానిని వ్యతిరేకిస్తోందని ఆయన విమర్శించారు. ఇక అసోంలోని 'జాతి' (సమాజం), 'మాటి' (భూమి), 'భేటీ' (పునాది)లను రక్షించడానికి బీజేపీ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తూ, ప్రాంతీయ భావాలపై ఆయనకు ఉన్న అవగాహనను అమిత్? షా ప్రశ్నించారు. కరీంగంజ్? పేరును బీజేపీ శ్రీభూమిగా మార్చిందని ఆయన గుర్తు చేస్తూ, ఇటలీ మూలాలు ఉన్నవారికి ఈ పేరు మార్పు ప్రాముఖ్యత గురించి ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ అస్సామీ, బంగాలీ భాషలకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదా కల్పించారని ఆయన పేర్కొన్నారు. కాగా, అసోం అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 9న ఒకే దశలో జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలు 2026 మే 4న వెలువరించనున్నారు.

# కేరళ, పుదుచ్చేరి, అసోంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెర

కేరళ, పుదుచ్చేరి, అసోంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ నేతల ప్రసంగాలు, భారీ బహిరంగ సభలు, రోడ్ షోలతో మారుమోగిన మైకులు ఈ సాయంత్రం 5 గంటల తర్వాత మూగబోయాయి. ప్రచారానికి చివరి రోజున కావడంతో అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. కేరళలో ూా.ఇ.ఖీ, ఖఇఖీ పరస్పరం విమర్శలు గుప్పించుకున్నాయి. అసోంలో బీజేపీ, కాంగ్రెస్ ప్రచార హోరు వాడివేడిగా జరిగింది. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రధాన పార్టీల ప్రచారం జోరుగా సాగింది.

### అసోంలో ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

అసోం అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఈ సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ప్రచారం ఆఖరి రోజున ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులను ప్రోత్సహించిందని, రాష్ట్ర అభివృద్ధికి నిరోదకంగా మారిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో బహుభార్యాత్వాన్ని నిరోధించడానికి ఉమ్మడి పౌరస్మృతి–ఖజజ అమలు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. తమ పాలనలో బాల్య వివాహాలను 84 శాతం తగ్గించామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేశామని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు.

మరోవైపు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రతిపక్ష కూటమి తరపున జోరుగా ప్రచారం చేశారు. బీజేపీ ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని, సీఎం, ఆయన కుటుంబ సభ్యులు భారీ అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ ఆరోపించింది. తాము అధికారంలోకి వస్తే మహిళల



కు నగదు సాయం, ఆరోగ్య బీమా, స్థానిక ప్రజలకు భూమి హక్కులు కల్పిస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. ఏప్రిల్ 9న అసోంలో పోలింగ్ జరగనుండగా మొత్తం 126 స్థానాల్లో బరిలోకి దిగిన 722 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. గతంలో పలు విడతలుగా జరిగిన ఎన్నికలకు భిన్నంగా, ఈసారి అసోంలో కేవలం ఒకే దశలో పోలింగ్ జరగనుంది.

### ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్న ప్రధాన పార్టీలు

కేరళంలో ఇండియా కూటమి, ూా.ఇ.ఖీ ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నాయి. అభివృద్ధి, అవినీతి అంశాలే లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధించుకున్నాయి. ఈ ఎన్నికల్లో కేరళలోని 140 స్థానాలకు 883 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.32 కోట్ల మంది పురుషులు, 1.39 కోట్ల మంది మహిళలు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అటు దాదాపు 2.42 లక్షల మందికి పైగా విదేశీ ఓటర్లు ఉన్నారని ఈసీ తెలిపింది. కాగా, ఈ ఎన్నికల్లో ప్రధానంగా ూాఇఖీ, ఖఇఖీ, చీణూా కూటముల మధ్య పోటీ నెలకొంది.

### పుదుచ్చేరిలో జోరుగా ప్రధాన పార్టీల ప్రచారం

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రధాన పార్టీల ప్రచారం జోరుగా సాగింది. పుదుచ్చేరిలోని 30 స్థానాలకు 294 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధానంగా ఎన్డీఏ– ఇండియా కూటమికి మధ్య పోటీ నెలకొంది. పుదుచ్చేరి, కారైకల్, మాహే, యానాం ప్రాంతాలలో కలిపి అసెంబ్లీలో ముప్పై సీట్లు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 9,48,977 మంది ఓటర్లు ఉండగా, అందులో 4,45,761 మంది పురుషులు, 5,03,076 మంది మహిళలు, 140 మంది ట్రాన్స్?జెండర్లు ఉన్నారు.

### మే 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలు

ప్రస్తుతం 5 రాష్ట్రాల్లో ఈసీ ఎన్నికలు నిర్వహిస్తోంది. తొలి విడతలో కేరళ, పుదుచ్చేరి, అసోంలో ఏప్రిల్ 9న ఎన్నికలు నిర్వహించనుండగా తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. ఇక బంగాల్‌లో 2 విడతలుగా ఓటింగ్ జరగనుంది. తొలి విడత ఏప్రిల్ 23న, రెండో విడత 29న నిర్వహించనున్నారు. ఎన్నికల ఫలితాలను మే 4న వెలువడనున్నాయి.

## ఓటర్ల జాబితా నుంచి పేర్లను తలలో 'పేలు' మాదిరిగా ఏరిపారేశారు

ఓట్ల తొలగింపుపై బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీవ్రస్థాయిలో స్పందించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తర్వాత మతువా, మైనారిటీలకు చెందిన ఓట్లను ఈసీ తొలగించిందని ఆరోపించారు. ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర దినాజ్‌పూర్ వంటి గణనీయమైన మైనారిటీ జనాభా ఉన్న జిల్లాల్లో ఓటర్ల జాబితా నుంచి పేర్లను తలలో పేల మాదిరిగా ఏరివేస్తున్నారని మమతా ఆరోపించారు. అయితే, ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించిన వారి పక్షాన టీఎంసీ న్యాయ పోరాటం చేస్తుందని ఆమె తెలిపారు. ఈ విషయంపై తాము సుప్రీంకోర్టులో బలంగా వాదనలు వినిపించడంతో దాదాపు 32 లక్షల పేర్లను ఈసీ ఓటరు జాబితాలో తిరిగి చేర్చిందని చెప్పారు. అలాగే, జాబితాలో పేర్లు లేని వారు ట్రైబ్యునల్ ఎదుట హాజరవ్వాలని సూచించారు. నాదియా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మమతా ఈ మేరకు వ్యాఖ్యానించారు. అలాగే, చొరబాట్లపై కేంద్ర వైఖరిని మమతా ప్రశ్నించారు. దేశ సరిహద్దులను రక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మమత స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్రం, తమ ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ సహా హక్కులను కాపాడుకునేందుకు బంగాల్ పౌరులంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు బంగాల్ ప్రజల గౌరవాన్ని, గుర్తింపును కాపాడే పోరాటమని అభివర్ణించారు. ఇదిలా ఉండగా, ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం బంగాల్? ఓటర్ల జాబితా నుంచి దాదాపు 91 లక్షల మంది ఓటర్లను తొలగించారు. అయితే, రాష్ట్రానికి సంబంధించి తుది జాబితా ఇంకా ప్రకటించాల్సి ఉంది. అయితే, ఈ విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్దిష్ట వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తున్నారని మమతా ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన డేటా ప్రకారం, గత ఏడాది అక్టోబర్ చివరి నాటికి గుర్తించిన 7.66 కోట్ల మంది ఓటర్ల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుంటే, ప్రస్తుతానికి రాష్ట్రంలో జరిగిన మొత్తం తొలగింపుల శాతం 11.85 శాతానికి పైగా ఉన్నాయి. అలాగే, ఎస్?ఐఆర్? ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన మొత్తం తొలగింపుల సంఖ్య 90.83 లక్షలకు పైగా ఉంది. పరిశీలనలో ఉన్న 60.06 లక్షల మంది ఓటర్లలో దాదాపు 27.16 లక్షల మందిని జాబితా నుంచి తొలగించినట్లు ఈసీ గణాంకాలు వెల్లడించాయి.

మరోవైపు, ముస్లిం జనాభా అధికంగా ఉన్న ముర్షిదాబాద్ జిల్లాలో అత్యధిక తొలగింపులు నమోదైనట్లు గణాంకాలు తెలిపాయి. ఈ జిల్లాలో న్యాయపరమైన పరిశీలనలో ఉన్న 11.01 లక్షల పేర్లలో 4.55 లక్షలకు పైగా పేర్లను జాబితా నుంచి తొలగించారు. దీనితో ఆ జిల్లాలో పరిశీలనలో ఉన్న ఓటర్ల తొలగింపు శాతం సుమారు 41.33 శాతానికి చేరింది. అలాగే, బంగ్లాదేశ్ సరిహద్దులో ఉన్న ఉత్తర 24 పరగణాల జిల్లాలో కూడా గణనీయమైన తొలగింపులు నమోదయ్యాయి. ఇక్కడ పరిశీలనలో ఉన్న 5.91 లక్షల మంది ఓటర్లలో 3.25 లక్షలకు పైగా ఓటర్లు ఓటు వేయడానికి అర్హులు కాదని తేలింది. అలాగే మాల్దా జిల్లాలో న్యాయపరమైన సమీక్షలో ఉన్న 8.28 లక్షల మంది ఓటర్లలో 2.39 లక్షలకు పైగా ఓటర్లను జాబితా నుండి తొలగించారు. అలాగే, న్యాయపరమైన పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం దక్షిణ 24 పరగణాల జిల్లాలో తొలగింపుల సంఖ్య దాదాపు 2.23 లక్షలు, తూర్పు బర్ధమాన్ జిల్లాలో 2.09 లక్షలు, నాదియా జిల్లాలో 2.98 లక్షలుగా నమోదైనట్లు ఎన్నికల సంఘం గణాంకాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చెందిన భవానిపుర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉన్న కోల్‌కతా సౌత్‌లో 28,000 మందికి పైగా ఓటర్లను తొలగించారు. కోల్‌కతా నార్త్‌లో పరిశీలనలో ఉన్న సుమారు 39,000 మంది ఓటర్లు ఓటు వేయడానికి అర్హులు కాదని తేలింది. కాగా, బంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలకు గానూ రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దశలో ఏప్రిల్ 23న 152 స్థానాలకు, మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న రెండో దశలో పోలింగ్ జరగనుంది.

## మతవిశ్వాసం న్యాయ సమీక్షకు అతీతం

శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10–50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్రం సమర్థించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసానికి సంబంధించినదని పేర్కొంది. ఈ ఆంక్షలు మత స్వయం ప్రతిపత్తి పరిధిలోకి వస్తాయని, న్యాయ సమీక్ష పరిధికి అతీతమైనవని స్పష్టం చేసింది. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళ ప్రవేశంపై కేంద్రం వైఖరిని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలియజేశారు. "మనం అన్ని మత విశ్వాసాలను గౌరవించాలి. ప్రతీ విషయం గౌరవానికి లేదా శారీరక స్వేచ్ఛకు సంబంధించినది కాదు. నేను ఒక గురుద్వారాకు వెళ్లినప్పుడు నా తలపై ఒక వస్త్రాన్ని కట్టుకుంటాను. అప్పుడు నేను నా గౌరవం, హక్కులు, ఇష్టాలకు భంగం కలిగిందని అనలేను" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి తుషార్ మెహతా వెల్లడించారు. "నరబలి ఒక మతపరమైన ఆచారమని ఎవరైనా వాదించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద కోర్టును ఆశ్రయిస్తే అది మతపరమైన సంప్రదాయమా లేదా ఆవశ్యకమైన ఆచారామా అని కోర్టు పరిశీలించాల్సిన అవసరం లేదు. ప్రజా భద్రత, నైతికతను నేరుగా ఉల్లంఘిస్తుందనే కారణంతో ఆ పిటిషన్‌ను నేరుగా తిరస్కరించవచ్చు. రాజ్యాంగం మత స్వేచ్ఛను పరిరక్షిస్తుంది. ఎందుకంటే మతాల్లో మెజారిటీ ప్రజల అభిరుచికి సంబంధించిన లౌకిక ప్రమాణాలను సంతృప్తిపరచని నమ్మకాలు, ఆచారాలు, ఆరాధనా రూపాలు ఉండొచ్చు. రాజ్యాంగంలో రాజ్యాంగ నైతికత గురించి కచ్చితంగా నిర్వచించలేదు. మతపరమైన విషయాలు, పవిత్ర గ్రంథాలు, శాస్త్రాలు, గ్రంథాలు మొదలైన వాటిపై న్యాయస్థానానికి పూర్తి అవగాహన ఉండకపోవచ్చు. ప్రతి మతానికి దాని విభిన్న విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగానికి వారి సొంత విశ్వాసంపై నమ్మకం ఉంది" అని తుషార్ మెహతా స్పష్టం చేశారు. అన్ని వయసుల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతిస్తూ 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాలని తుషార్ మెహతా కోరారు. గుడిలోకి మహిళల ప్రవేశంపై నిషేధం అంటరానితనానికి సమానమని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 17ను ఉల్లంఘిస్తుందని అప్పట్లో సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించిందని, ఈ విషయంపై తనకు చాలా అభ్యంతరాలు ఉన్నాయన్నారు. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఆంక్షలు కేవలం వయసు ఆధారంగా మాత్రమే ఉన్నాయని వెల్లడించారు. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని పూర్తిగా బహిష్కరించలేదని చెప్పారు. మహిళా దేవతలకు నమస్కరించే ఏకైక సంస్కృతి మనదేనని అన్నారు.

## రేవంత్ రెడ్డిపై కేరళ సీఎం ఘాటు విమర్శలు

ఎప్పుడూ హుందాగా వ్యవహరించే కేరళ సీఎం విజయన్, తాజాగా తెలంగాణ సీఎం రేవంత్‌పై ఘాటుగా స్పందించారు. ఒకరకంగా చెప్పాలంటే రేవంత్ రెడ్డిని కించపరిచేలా ఉండే మలయాళ పదాలను ఉపయోగించడం కేరళ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఇటీవలే రేవంత్ చేసిన కామెంట్స్ తనను వ్యక్తిగతంగా, రాజకీయంగా కించపరిచేలా ఉన్నాయని భావించిన విజయన్ ఈ మేరకు తీవ్రస్థాయిలో స్పందించినట్లు తెలుస్తోంది. మంగళవారం రోజు కేరళలోని కన్నూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ సమావేశంలో విజయన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, తనపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను కేరళ ముఖ్యమంత్రి తప్పుపట్టారు. మలయాళం భాషలోని పరుష పదజాలంతో సీఎం రేవంత్‌పై విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి లాంటి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రేవంత్ ప్రసంగాల్లో ఇంతటి దారుణమైన భాషను ఉపయోగించొచ్చా అంటూ విజయన్ ఫైర్ అయ్యారు. సీఎం స్థాయి పదవికి తగిన ప్రమాణాలను రేవంత్ పాటిస్తున్నారా లేదా అని ఆయన ప్రశ్నించారు. కేరళ ఎన్నికల చివరి దశ ప్రచార కార్యక్రమాల హడావిడి కారణంగా రేవంత్ వ్యాఖ్యలపై స్పందించేందుకు తనకు సరిపడా సమయం లేదన్నారు. రేవంత్ రెడ్డి చేసిన అన్ని వ్యాఖ్యలపై త్వరలోనే సరైన సమయంలో స్పందిస్తానని విజయన్ వెల్లడించారు. ఒక ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన కనీస మర్యాదను ఇచ్చారా లేదా అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలని రేవంత్‌కు ఆయన సూచించారు. 'దశ మోనే రేవంత' అనేది మలయాళం భాషలో వ్యంగ్య విమర్శలకు ప్రయోగించే పదం. ఇటీవలే 'నీ పో మోనే విజయ' (నీ పని అయిపోయింది. ఇక వెళ్లు విజయన్) అని సీఎం రేవంత్ విమర్శించారు. దీనికి ఇప్పుడు విజయన్ పరుష పదజాలంతో కౌంటర్ ఇచ్చారు. కేరళ ప్రజలంతా మళ్లీ సీపీఎం సారధ్యంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని సీఎం విజయన్ అన్నారు. 2021 ఎన్నికల నాటి కంటే ఎక్కువ అసెంబ్లీ సీట్లతో ఈసారి అధికారంలోకి వస్తామని విశ్వాసం వెలిబుచ్చారు. అన్నిచోట్లా కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమికి ప్రజా తిరస్కరణే ఎదురవుతోందని ఆయన పేర్కొన్నారు.

# చర్చకు సిద్ధం



-మొదటిపేజీ తరువాయి

విజయన్ సహా ఎల్‌డీఎఫ్ నేతలకు స్పష్టం చేశారు. ఎన్నికలు కేరళం, తెలంగాణ మధ్య కాదన్న రేవంత్ యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ మధ్య జరుగుతున్నాయని తెలిపారు. పినరయి విజయన్ పని అయిపోయిందన్న రేవంత్‌రెడ్డి, మూడింట రెండొంతుల మెజార్టీతో యూడీఎఫ్ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవల తనపై పినరయి చేసిన విమర్శలను రేవంత్‌రెడ్డి తోసిపుచ్చారు. తెలంగాణలో కేసీఆర్‌ను ఎలా మార్చారో కేరళంలో విజయన్‌ను కూడా అలా మారుస్తారని రేవంత్ రెడ్డి అన్నారు. విజయన్‌గాడ్ ఫాదర్ మోదీ ఢిల్లీలో ఉన్నారన్నారు. ఆయనే విజయన్‌ను కేసుల నుంచి రక్షిస్తున్నారని రేవంత్ వివరించారు. మోదీ, విజయన్ మధ్య ఒప్పందం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కేరళంలో సక్సెస్ స్టోరీ విజయన్ పాలనలో వచ్చింది కాదని ఉమెన్‌చాందీ, కరుణాకరన్ కేరళం అభివృద్ధి కోసం బాటలు వేశారన్నారు. పినరయి విజయన్‌కు కాలం అయిపోందని అన్నారు. తెలంగాణలోని ఏ మూలకైనా వెళ్లి మేం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించవచ్చున్నారు. ఈ విషయంలో తాను విజయన్‌కు సవాల్ విసురుతున్నానన్నారు. పినరయి విజయన్ కేరళం ప్రజలను మోసం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇందుకు సంబంధించి తాను చాలా ఆధారాలు ఇచ్చానన్నారు. వారు తెలంగాణపై(పినరయి విజయన్) తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు. దీనిపై పినరయి విజయన్‌తో చర్చకు తాను సిద్ధమని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయనకు ఆదర్శవంతమైన నేతలు మోదీ, అమిత్‌షానా లేక జ్యోతిబసు, సోమనాథ్ చటర్జీనా అని ప్రశ్నించారు. విజయన్ ప్రధాని మోదీ సూచనలు తీసుకుంటున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక మోదీ ఢిల్లీ నుంచి పాలిస్తే మరో మోదీ తిరువనంతపురం నుంచి పాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేరళంలో విజయన్? మోదీలా పాలిస్తున్నారన్నారు. ఓట్ల కోసం మోదీలానే విజయన్? తన పేరుతో ప్రచారం చేస్తున్నారన్నారు.

"కేరళంలో పోటీ తెలంగాణ, కేరళం మధ్య కాదు. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ మధ్య జరుగుతోంది. నేను అడిగిన ప్రశ్నలకు ఆయన? (పినరయి విజయన్) సమాధానం చెప్పాలి. ఆయన 120 నెలల పాటు కేరళంను పాలించారు. ఆయన తన పాలనపై కేరళం ప్రజలకు సమాధానం చెప్పాలి. నేను వాస్తవాలను ప్రజల ముందు ఉంచాను. ఆ సమాచారంపై ఆయన తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అందుకే వాస్తవాలతో కూడిన లేఖ కూడా రాశాను. వాటిపై ఆయనతో చర్చించడానికి సిద్ధంగా ఉన్నాను. పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ 2023-24 ముందు వరకూ తెలంగాణలో అధికారంలో ఉండేవారు. అప్పుడు తెలంగాణ పరిస్థితిని విజయన్ ప్రస్తావించారు. నేను అప్పుడు అధికారంలో లేను. ఆ పాలనను చూసే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఇంటికి పంపారు. ఇప్పుడు పినరయి విజయన్ వంతు వచ్చింది"-రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి

**సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై స్పందించిన కేరళ ముఖ్యమంత్రి :**

తనతో చర్చకు రావాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళం సీఎం పినరయి విజయన్ స్పందించారు. రేవంత్‌రెడ్డితో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదని వివరించారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణ రాష్ట్రంలో పార్టీలు ఉన్నాయని, రేవంత్ ప్రభుత్వ పనితీరుపై తెలంగాణ ప్రజలే తీర్పు ఇవ్వాలని విజయన్ తెలిపారు. కేరళంలో ఎన్నికల ప్రచార సభలో అభివృద్ధిపై తనతో చర్చకు రావాలని రేవంత్ రెడ్డి సవాల్ విసిరిన విషయం తెలిసిందే.

# తెలంగాణ మావోయిస్టు విముక్త ప్రాంతంగా మారింది



-మొదటిపేజీ తరువాయి

అవకాశం ఏర్పడిందన్నారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు అత్యంత కీలకమని తెలిపారు. తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణతో కలిసి డీజీపీ పర్యటించారు. కర్రెగుట్టల్లోని పామునూరు పోలీస్ ఔట్ పోస్ట్‌కు భూమిపూజ చేశారు. ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషన్ సెంటర్‌కు ఆయన శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ-ఛత్తీస్?గఢ్ సరిహద్దుల్లో రోడ్లు వేసి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు.

**అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి**

కర్రెగుట్టలు ప్రాంత అభివృద్ధికి అటంకంగా ఉన్న సమస్య చాలా వరకు తీరిపోయిందని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. అభివృద్ధికి దూరమైన ప్రాంతాలను మిగతా ప్రపంచంతో అనుసంధానం చేయాలని, అలా చేస్తేనే ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకుంటాయని కేంద్ర, రాష్ట్రాలు భావించాయని తెలిపారు. ఏ ప్రాంతం అయిన బాగుండాలంటే మౌలిక వసతులు, భద్రత బాగుండాలన్నారు. కొన్ని కారణాల వల్ల కర్రెగుట్టల్లో అభివృద్ధికి దూరమైందని, ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమాలతో అభివృద్ధి జరుగుతుందన్నారు. మున్ముందు ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ నక్సల్స్? విముక్త ప్రాంతంగా మారిందని వివరించారు. పామునూరు గ్రామస్థులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, సోలార్ లాంతర్లను డీజీపీ పంపిణీ చేశారు. అటవీ చట్టాలను ఉల్లంఘించకుండా కర్రెగుట్టల్లో రోడ్లు వేస్తున్నామని ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి మంచి అవకాశం ఉందన్నారు.

"మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉండటం వల్ల కర్రెగుట్టలు చాలా కాలం పాటు అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. కనీస సౌకర్యాలైన రోడ్లు, వీధిలైట్లు లాంటివి లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. నక్సల్స్? దాదాపు అంతరించడంతో అభివృద్ధి దిశగా పడుతున్నాయి. బాహ్యప్రపంచంతో అనుసంధానం ఏర్పరిచేందుకు రోడ్లు ఉపయోగపడతాయి. అందులో భాగంగానే ఇక్కడ రోడ్లు వేయడం జరిగింది. ఇప్పటి వరకు 13 కి.మీ రోడ్ల నిర్మాణం పూర్తయింది

**రోడ్డు భద్రతే అన్నింటికన్నా ముఖ్యం**

అజాగ్రత్తతో వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దని సురక్షిత డ్రైవింగ్? అన్ని విధాల మేలని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలంలో రోడ్డు భద్రతపై అరైవ్ అలైవ్? కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. హెల్మెట్? లేకుండా, సెల్?ఫోన్? మాట్లాడుతూ వాహనం నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఆయన తెలిపారు.

అటవీ చట్టాలను ఉల్లంఘించకుండా కర్రెగుట్టల్లో రోడ్డు వేయిస్తున్నామని ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ తెలిపారు. ఇక్కడ ఎకోటూరిజం అభివృద్ధికి అవకాశం ఉందని తెలిపారు. గతంలో తాడ్వాయి దాటి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయలేకపోయామన్నారు. ఇప్పుడు అడవుల్లోనూ ఎకో టూరిజం సాధ్యమవుతోందన్నారు. ములుగు జిల్లాలో ఏజెన్సీలోని వాటర్?ఫాల్స్?ను అభివృద్ధి చేస్తామన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి



**నల్గొండ :** ల్గొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు ఎగబడుతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సొంత నిధులతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసిన ఈ పాఠశాలలో స్మార్ట్ క్లాసులు, ఏఐ బోధన, డిజిటల్ ల్యాబ్స్ వంటి అత్యాధునిక వసతులు ఉండటంతో ప్రైవేట్ స్కూళ్లను వదిలి ఇక్కడ చేర్పించేందుకు పిల్లల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. సీట్లు పరిమితంగా ఉండటంతో అడ్మిషన్ల కోసం భారీగా రద్దీ నెలకొంది. ఉదయం నుంచే స్కూల్ గేటు మందు క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. గవర్నమెంట్ స్కూల్స్ అంటే శిథిలావస్థలో ఉన్న భవనాలు, అరకొర వసతులు అనే ముద్ర ఇప్పటికీ ఉంది. ప్రస్తుత కాలంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లలో చదివించేందుకు ఇష్టపడటం లేదు. అప్పు చేసైనా సరే.. ప్రైవేటు స్కూళ్లకు పంపించాలనే ఆలోచనలో తల్లిదండ్రులు ఉంటున్నారు. కానీ నల్గొండలోని ఓ గవర్నమెంట్ స్కూల్ మాత్రం అందుకు భిన్నం. బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పేరెంట్స్ అభిప్రాయాన్ని పూర్తిగా చెరిపివేసింది. ఈ స్కూల్‌లో అడ్మిషన్ కోసం విపరీతమైన పోటీ ఉంటుంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఒక సీటు సంపాదించడం కోసం తల్లిదండ్రులు పడుతున్న తాపత్రయం చూస్తుంటే కార్పొరేట్ స్కూళ్లు కూడా దిగదుడుపే అనిపిస్తోంది. ఇవాళ తెల్లవారుజాము నుంచే స్కూల్ గేటు ముందు తల్లిదండ్రులు, విద్యార్థులు భారీ క్యూ లైన్లలో వేచి చూడటం ఇక్కడి విద్యా ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తోంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన కుమారుడి జ్ఞాపకార్థం ఈ పాఠశాలను సొంత నిధులతో అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దారు. కేవలం భవన నిర్మాణమే కాకుండా, విద్యాబోధనలో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఇక్కడ విద్యార్థులకు స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన, అత్యాధునిక డిజిటల్ ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుల అనుభవజ్ఞులైన బోధనతో పాటు, అధునాతన సాంకేతికత తోడవడంతో విద్యార్థుల భవిష్యత్తుకు ఇక్కడ బలమైన పునాది పడుతోందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. చదువుతో పాటు విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం విశాలమైన క్రీడా మైదానాన్ని కూడా ఏర్పాటు చేశారు. అలాగే, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేర్పించేందుకు పోటీ పడుతున్నారు. నల్గొండ జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇది కేవలం ప్రభుత్వ పాఠశాల కాదని.... కార్పొరేట్ స్థాయికి దీటైన ఒక విశ్వవిద్యాలయంలా ఉందని క్యూలో నిలబడిన ఒక తండ్రి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సీట్లు పరిమితంగా ఉండటం, డిమాండ్ విపరీతంగా పెరగడంతో పాఠశాల యాజమాన్యానికి అడ్మిషన్ల నిర్వహణ పెద్ద సవాలుగా మారింది. మంత్రి విజన్, అధికారుల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల కృషి వెరసి ఈ పాఠశాల నేడు ఒక కార్పొరేట్ స్కూల్‌గా నిలిచింది. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెంచడమే కాకుండా.. విద్యా విప్లవానికి నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాక్షిగా నిలుస్తోందని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను తలుచుకుంటే భయపడే రోజులు పోయి.. గర్వంగా చేర్పించే రోజులు వచ్చాయని అంటున్నారు.

## విస్తరణ పక్కా

-మొదటిపేజీ తరువాయి

అధిష్టానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు ప్రస్తుతం కేరళ సహా ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ కీలక సమయంలో కేబినెట్ విస్తరణ చేపడితే పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తి ఎన్నికల వ్యూహాలపై ప్రభావం పడుతుందని హైకమాండ్ భావిస్తోంది. ఎన్నికల ప్రక్రియ ముగిసి ఫలితాలు వెలువడిన తర్వాతే తెలంగాణలో పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని ముఖ్యమంత్రి స్వయంగా స్పష్టం చేయడంతో ఆశావహులు తమ ప్రయత్నాలను తాత్కాలికంగా నెమ్మదించారు. ఈసారి విస్తరణ కేవలం ఖాళీగా ఉన్న ఆరు స్థానాల భర్తీకే పరిమితం కాకుండా ఒక భారీ ప్రక్షాళన దిశగా సాగనుంది. మంత్రుల గత ఏడాది కాలం పనితీరుపై ముఖ్యమంత్రి ఇప్పటికే ఒక ప్రోగ్రెస్ రిపోర్ట్ సిద్ధం చేసినట్లు సమాచారం. శాఖల వారీగా సాధించిన పురోగతి, ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, మంత్రులపై వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ఇద్దరు లేదా ముగ్గురు పాత వారిని తప్పించే అవకాశం ఉంది. పనితీరు సరిగ్గా లేని వారి స్థానంలో కొత్త రక్తానికి అవకాశం ఇచ్చి పాలనలో వేగం పెంచాలని రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. సామాజిక సమీకరణాల పరంగా ఈ విడత విస్తరణలో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటివరకు మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం లేని బీసీ సామాజిక వర్గానికి అలాగే లంబాడా వర్గానికి కచ్చితంగా చోటు కల్పించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ప్రాతినిధ్యాన్ని పెంచేలా ముఖ్యమంత్రి తన బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు. మైనారిటీ కోటాలో మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ పేరు పరిశీలనలో ఉన్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కుతుందా లేదా కీలక నామినేటెడ్ పదవితో సరిపెడతారా అనేది ఐదు రాష్ట్రాల ఫలితాల అనంతరం తేలనుంది. విస్తరణ వార్తలతో ఆశావహ ఎమ్మెల్యేల్లో టెన్షన్ పెరిగింది. సీనియర్ నేతలు రాజగోపాల్ రెడ్డి, శ్రీధర్ బాబు వంటి వారు తమ ప్రాధాన్యతలను కాపాడుకునే ప్రయత్నం చేస్తుండగా మరికొందరు కొత్తగా చోటు దక్కించుకోవడానికి ఢిల్లీ స్థాయిలో పైరవీలు ముమ్మరం చేశారు. తమ పదవులు ఊడుతాయన్న భయంతో కొందరు మంత్రులు అధిష్టానం పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇదే సమయంలో కీలక నామినేటెడ్ పదవుల భర్తీ కూడా ఉండటంతో పార్టీలో పదవుల వేట తీవ్రతరమైంది. తెలంగాణ కేబినెట్ మార్పులు జాతీయ రాజకీయాల ఫలితాలతో ముడిపడి ఉన్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించే సీట్ల ఆధారంగా అధిష్టానం ముఖ్యమంత్రికి ఇచ్చే స్వేచ్ఛ ఆధారపడి ఉంటుంది. మే నెలలో ఫలితాలు వచ్చిన వెంటనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే పాలనలో తనదైన ముద్ర వేసేలా సమర్థులైన వారితో కూడిన సరికొత్త రేవంత్ మార్క్ కేబినెట్ మే నెలలో రూపుదిద్దుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## 'రేవంత్.. మళ్లీ గెలవడం కాదు.. సింగిల్ డిజిటే మీకు'

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజమెత్తారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందంటూ సీఎం రేవంత్ చేసే వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించారు హరీష్‌రావు. కాంగ్రెస్ మళ్లీ గెలవడం కాదు.. సింగిల్ డిజిట్‌కే పరిమితం అంటూ ఎద్దేవా చేశారు. ఈరోజు(మంగళవారం, ఏప్రిల్ 7వ తేదీ) పరిగి పర్యటనకు వెళ్తున్న హరీష్‌రావును పోలీసులు అరెస్ట్ చేసి శంషాబాద్ పీఎస్‌కు తరలించారు. దీనిలో భాగంగా ఆయన్ను విడుదల చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు హరీష్. 'మీరు మళ్లీ గెలవడం కాదు కదా.. ఈసారి సింగిల్ డిజిటే మీకు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవ్వడం ఖాయం. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?, పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే మమ్మల్ని అరెస్టు చేశారు. రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన... బేడీల పాలన గుడ్డి పాలన. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండి. ఎస్సీ ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటున్నారు. మీ పాలన అంతా బోగస్ మాటలు బోగస్ పాలన. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా?, పరిగిలో భూముల లాక్కొని తన అన్న కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదు?, వచ్చే ఎన్నికల్లో రాబోయే కేసీఆర్ రాజ్యమే' అని హరీష్ స్పష్టం చేశారు.

## పాత పేరు.. కొత్త అజెండా



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ యవనికపై మరో కీలక మలుపునకు రంగం సిద్ధమవుతోంది. భారత రాష్ట్ర సమితి అగ్రనాయకత్వానికి ఊహించని షాక్ ఇస్తూ, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ అజెండాను సిద్ధం చేసుకుంటున్నారు. తాజాగా ఆమె మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్‌కు మారుపేరైన 'టీఆర్ఎస్' పేరును ఆమె ప్రస్తావించడం, బీఆర్ఎస్ ఉనికికే సవాలుగా మారేలా కనిపిస్తోంది. పరోక్షంగా తన భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీపై చర్చించేందుకు పిలిచిన ఈ సమావేశంలో రాజకీయ ప్రశ్నలు ఎదురైనప్పుడు ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం టీఆర్ఎస్ పేరు ఫ్రీగా ఉంది.. దాన్ని ఎవరైనా వాడుకోవచ్చు" అని ఆమె అనడం వెనుక లోతైన వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. తన పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల మేరకే నడుస్తుందని, తమకు ఇతర రాష్ట్రాల సిద్ధాంతకర్తలు అవసరం లేదని స్పష్టం చేయడం ద్వారా ఆమె నేరుగా బీఆర్ఎస్ ప్రస్తుత పోకడలపై విమర్శలు గుప్పించారు. 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి , రెండు దశాబ్దాల పోరాటం తర్వాత రాష్ట్రాన్ని సాధించి పెట్టింది. అయితే, 2022 అక్టోబర్ 5న జాతీయ రాజకీయాల కాంక్షతో కేసీఆర్ ఈ పేరును భారత రాష్ట్ర సమితి మార్చారు. ఈ నిర్ణయం చారిత్రక తప్పిదమని, దీనివల్ల తెలంగాణ అస్తిత్వంతో ఉన్న పేగుబంధం తెగిపోయిందని ఇప్పుడు పార్టీ శ్రేణులే భావిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 39 సీట్లకే పరిమితం కావడం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడంతో బీఆర్ఎస్ తీవ్ర నైరాశ్యంలో ఉంది. సరిగ్గా ఈ సమయంలో కవిత మళ్లీ పాత పేరును తలకెత్తుకోవడం ద్వారా తెలంగాణ వాదులను, అసంతృప్త నేతలను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. కవిత తన మాటల్లో మరో కీలక అంశాన్ని ప్రస్తావించారు. తమ పార్టీలో బిహార్ సిద్ధాంతకర్తలు ఉండరని చెప్పడం ద్వారా బీఆర్ఎస్ నియమించుకున్న పొలిటికల్ స్ట్రాటజిస్టుల పెత్తనాన్ని ఆమె ఎండగట్టారు. ఇది నేరుగా కేటీఆర్ అనుసరిస్తున్న కార్పొరేట్ తరహా రాజకీయాలపై ఆమె చేసిన దాడిగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే శక్తి దానికి లేదని ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత పోరును బహిర్గతం చేస్తున్నాయి. కవిత తన కొత్త పార్టీ పేరును, అజెండాను ఈ నెలాఖరున ప్రకటించే అవకాశం ఉంది. ఒకవేళ ఆమె నిజంగానే టీఆర్ఎస్ పేరుతో ముందుకు వస్తే బీఆర్ఎస్ నాయకత్వం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరం. తెలంగాణ ప్రజల గుండెల్లో టీఆర్ఎస్ అనే పేరుకు ఉన్న క్రేజ్ కవితకు ప్లస్ అయ్యే అవకాశం ఉంది. పాత ఉద్యమకారులు, క్షేత్రస్థాయి కార్యకర్తలు కవిత వైపు మొగ్గు చూపితే బీఆర్ఎస్ కు ఇబ్బందులు తలెత్తవచ్చు. కవితను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ చట్టపరమైన లేదా రాజకీయపరమైన ప్రయత్నాలు చేస్తే, అది ఆమెకు మరింత పబ్లిసిటీని తెచ్చిపెడుతుంది. తండ్రి వదులుకున్న అస్త్రమే ఇప్పుడు తనయకు ఆయుధంగా మారింది. పాత పేరు ? కొత్త అజెండాతో కవిత చేస్తున్న ఈ ప్రయోగం తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని ఏ విధంగా మారుస్తుందో చూడాలి. ఒకవేళ కవిత టీఆర్ఎస్ ను మళ్లీ బతికించగలిగితే, కేసీఆర్ వారసత్వాన్ని తానే కొనసాగిస్తున్నానని ఆమె క్లెయిమ్ చేసుకునే అవకాశం కలుగుతుంది.

# జర్మనీలో ఉద్యోగావకాశాలపై మంత్రి వివేక్ ఉన్నతస్థాయి సమావేశం..



**మంచిర్యాల,ఏప్రిల్07(సూర్యరేఖ)**తెలంగాణ కార్మిక,ఉపాధి,గనులశాఖ మంత్రి డా.జీ. వివేక్ వెంకటస్వామి మంగళవారం జర్మనీలోని హానోవర్ నగరంలో జర్మన్ ఫెడరల్ ఎంప్లాయ్మెంట్ ఏజెన్సీ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు.రాష్ట్ర యువతకు విదేశీ ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ నుంచి జర్మనీకి నైపుణ్యంతో కూడిన మానవ వనరుల పంపిణీ అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు.ముఖ్యంగా నైపుణ్య కార్మికుల కొరత ఉన్న రంగాలను గుర్తించి, ఆ అవకాశాలను తెలంగాణ యువతకు అందించే మార్గాలపై దృష్టి సారించారు.జర్మన్ ఉద్యోగ మార్కెట్ అవసరాలను తీర్చేందుకు అవసరమైన నైపుణ్య ప్రమాణాలు,భాషా శిక్షణ,సర్టిఫికేషన్ ప్రక్రియలపై సమగ్ర సమీక్ష చేపట్టారు.తెలంగాణ ప్రభుత్వం యువతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను మంత్రి వివేక్ వివరించారు.ముఖ్యంగా తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ద్వారా నూతన నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తూ,గ్లోబల్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రతినిధి బృందంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానా కిషోర్,టామ్‌కామ్ జనరల్ మేనేజర్ నాగభారతి, మేనేజర్ అనిల్ కుమార్,పీఎంయూ హెడ్ శ్రీనివాస్ రావు,స్కిల్ టాలెంట్ అక్విజిషన్ హెడ్ బాలా రమణి, శ్రీమతి సరోజ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జర్మన్ ఫెడరల్ ఎంప్లాయ్మెంట్ ఏజెన్సీలో ఎర్లీ కెరీర్ కౌన్సెలింగ్ విభాగం అధిపతి లారా బ్రైట్సామీటర్‌ను మంత్రి, ప్రతినిధి బృందం సన్మానించారు.ఈ సమావేశం ద్వారా తెలంగాణ యువతకు జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్మాణాత్మక మార్గాలు సుస్పష్టం అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఘనంగా ఎల్లమ్మ బోనాల జాతర







**గోదావరిఖని,ఏప్రిల్ 07(సూర్యరేఖ)**గోదావరిఖని పట్టణంలో ఎల్లమ్మ బోనాల జాతరను గౌడ కులస్తులు,సంఘాలు,గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు.మహిళలు తలలపై నెత్తిన బోనాలు,పూనకాలు,డప్పు చప్పులతో ఊరేగింపులు చేస్తూ ఎల్లమ్మ తల్లి ఆలయాలకు తరలి వెళ్లారు.భక్తి, ఆధ్యాత్మికత,సంప్రదాయాల సమ్మేళనం గా ఎల్లమ్మ బోనాల జాతర గోదావరిఖని పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు సాంప్రదాయ బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.డప్పుల వాయిద్యాలు,పూజా కార్యక్రమాలు,పోతరాజుల నృత్యాలు జాతరను మరింత ఉత్సాహభరితంగా మార్చాయి.ఈ సందర్భం గా భక్తులు అమ్మవారికి కోరికలు కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించగా, తమ మొక్కులు తీర్చుకున్నారు.గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు జాతరలో పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.భక్తుల కోసం తాగునీరు, ప్రసాదం, వైద్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లు కమిటీ సభ్యులు సమకూర్చారు .పోలీసుశాఖ భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టడంతో జాతర ప్రశాంతంగా కొనసాగింది.ఈ బోనాల జాతర ప్రాంతీయ సంస్కృతి,ఆచారాలను ప్రతిబింబిస్తూ భక్తి భావాన్ని మరింత బలపరిచిందని స్థానికులు తెలిపారు.

# ఎస్ఏఓగా పదవీ విరమణ చేసిన సమ్మయ్యకు ఘనంగా సన్మానం..



సమ్మయ్య,విఘ్నేశ్వరి దంపతులను సన్మానించిన ఎస్ఈ చంద్రమోహన్,ఎస్ఏఓ లోకేశ్వరయ్య





**చిక్కడపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** టీజీఎస్పీడీసీఎల్ సెంట్రల్ సర్కిల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎస్ఏఓ)గా పనిచేసి స్వచ్ఛంద పదవి విరమణ చేసిన బి.సమ్మయ్య,విఘ్నేశ్వరీ దంపతులను అధికారులు,సిబ్బంది ఘనంగా సన్మానించారు .మంగళవారం ఆర్టిసి క్రాస్ రోడ్ లోని ఓఫంక్షన్ హాల్ లో జరిగిన వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో సర్కిల్ ఎస్ఇటిఆర్ చంద్రమోహన్, ఎస్ఏఓ లోకేశ్వరయ్య,డివిజనల్ ఇంజనీర్(టెక్నికల్) సుచేంద్రనాథ్,మెహదీపట్నం డివిజన్ డిఈటి సుధీర్, అజమాబాద్ డిఈ కమల్ కుమార్, సైఫాబాద్ డిఈ శ్రీధర్,డిఈలు శ్రీనివాస్ రెడ్డి,సమ్మయ్య,లు శాలువాతో సత్కరించి వేడుకోలు పలికారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ. ..సమ్మయ్య విధి నిర్వహణలో ఎంతో బాధ్యతగా పనిచేశారన్నారు.సమ్మయ్య శేష జీవితం ఆరోగ్యం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

– జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

**గోదావరి పుష్కరాల పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ పరిశీలన**

**జగిత్యాల :** జిల్లాలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ సమగ్ర పరిశీలన నిర్వహించింది. ఈ పరిశీలనకు ఇంజినీర్-ఇన్-చీఫ్ జనరల్ ఓ.వి. రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య ఏర్పాట్లు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అలాగే, ఘాట్‌ల అభివృద్ధి పనులు, రహదారి మరమ్మత్తులు, విద్యుత్ సరఫరా, తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలను వేగవంతం చేయాలని టెక్నికల్ కమిటీ సూచించింది. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు

## తెలంగాణలో వలంటీర్ల వ్యవస్థ

**హైదరాబాద్, ఏప్రిల్ 7**

తెలంగాణలో వాలంటీర్ల వ్యవస్థను తీసుకురానున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ముగ్గురు చొప్పున మొత్తం 30 వేల మందిని నియమించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో భూసారాన్ని పరిరక్షించేందుకు ఈ సాయిల్ హెల్త్ వాలంటీర్లు పనిచేస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే ఎంపికైన తొలి దశ వాలంటీర్లకు ట్రైనింగ్ ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులు రసాయనాలను తగ్గించి.. భూసారాన్ని కాపాడేందుకు ఈ వాలంటీర్లు పనిచేయనున్నట్లు తెలిపారు.తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో భూసారాన్ని కాపాడేందుకు భూసార ఆరోగ్య వాలంటీర్లు ( సాయిల్ హెల్త్ వాలంటీర్లు )ను నియమించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 30 వేల మంది ఈ సాయిల్ హెల్త్ వాలంటీర్లను నియమిస్తామని.. ఇందులో భాగంగానే తొలి విడతలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎంపికైన వాలంటీర్లకు ట్రైనింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. హైదరాబాద్లోని అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ (ఇక్రిశాట్), తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఈ వాలంటీర్లకు శిక్షణ ఇస్తోంది ఇక్రిశాట్లో తొలి విడత సాయిల్ వాలంటీర్లకు ట్రైనింగ్ ప్రోగ్రామ్ను ప్రారంభించిన మంత్రి తుమ్మల

## ఆర్థిక సహాయం అందజేత..



**శివంపేట,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మెదక్ జిల్లా శివంపేట మండలంలోని చండి గ్రామంలోని రెండు కుటుంబాలకు మండల ప్రముఖ సంఘ సేవకులు తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా,చండి గ్రామానికి చెందిన ఉషగారి ఆంజనేయులు కుమార్తె వివాహానికి రూ.5వేలు,అలాగే కమ్మరి నర్సింలు అనారోగ్యంతో బాధపడుతున్నందున రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని చండి గ్రామ గైనిబైటి ప్రవీణ్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సౌజన్య నరేష్,గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు నర్సింగ్,ఆంజనేయులు,కర్రె వీరేష్ ,అబ్దుల్ లతీఫ్,బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పుల్లగుర్ల ముత్యంరెడ్డి,నాయకులు అంతిరెడ్డి అంజిరెడ్డి,వెంకట్ రెడ్డి,బాల్ రెడ్డి,కుమ్మరి గిరి,భానూరి ఆంజనేయులు గౌడ్,ఉప్పరి ప్రభు,శివన్నగారి అశోక్, గంటన్నగారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో మునిగి విద్యార్థి మృతి..



**బెల్లంపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)**తాళ్ల గురజాల ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లాలోని షంషేర్ నగర్‌కు చెందిన కొల్లూరి రాజేష్ (15),9వ తరగతి విద్యార్థి, ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు.మంగళవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో రాజేష్ తన స్నేహితులు సాయిచరణ్, దేవయ్య, రామ్ చరణ్‌లతో కలిసి లంబడి తండా గ్రామ సమీపంలోని చెరువు వద్దకు ఆటల కోసం వెళ్లాడు.అనంతరం స్నానం కోసం చెరువులోకి దిగిన రాజేష్‌కు ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు మునిగి ప్రాణాలు కోల్పోయాడు.ఈ ఘటనపై మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## నియామకమైన కాంగ్రెస్ నాయకులకు ఘనంగా సన్మానం




**మందమర్రి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మందమర్రి బ్లాక్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా డిసిసి వైస్ ప్రెసిడెంట్ బెల్లంకొండ కర్ణసాగర్ రావును,అలాగే మున్సిపాలిటీ ఇంచార్జ్‌గా డిసిసి సెక్రటరీ గోపతి బానేష్‌ను నియమించిన సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నాయకులు వారికి శాలువాలు కప్పి,మిఠాయి తినిపించి అభినందనలు తెలియజేశారు.నూతన బాధ్యతలు స్వీకరించిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జనరల్ సెక్రటరీ సోతుకు సుదర్శన్, మండల ఇంచార్జ్ కడారి జీవన్ కుమార్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు పాషా,మైనారిటీ అధ్యక్షులు జమీల్, సీనియర్ నాయకులు ఎర్ర రాజు, బుర్ర ఆంజనేయులు,రాచర్ల గణేష్,యువజన నాయకులు రాయబారపు కిరణ్,మూడారపు శేఖర్, మాయ తిరుపతి,సోతుకు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి హత్య కేసులో నిందితుడికి యావజీవ కారాగారా శిక్ష..

లైంగిక వాంఛ తీర్చమని అడగగా నిరాకరించడంతో వృద్ధురాలిని దారుణంగా హత్య..

నిందితుడికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష..



**కారేపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మండల కేంద్రమైన కారేపల్లి పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఆదేర్ల ఉపేందర్(54), భజ్యాతండాకు చెందిన అజ్మీరా నాజి (70)ను 2021 ఏప్రిల్ 21న తన ఇంటి వద్ద హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా చేసి బస్తాలో వేసి రైలు పట్టాలపై పడవేసి ఆధారాలు చెరిపివేయాలని ప్రయత్నించాడు.ఈ ఘటనలో ఓ యువకుడిని మోసం చేసి సహాయం పొందిన నిందితుడి చర్యలు అనుమానం కలిగించడంతో అసలు విషయం బయటపడింది సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో నేరాన్ని ఒప్పుకున్న ఉపేందర్ పై అభియోగాలు రుజువు అవడంతో రెండో అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టు యావజీవ శిక్షతో పాటు 15 వేల జరిమానా విధించింది కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన పోలీస్ అధికారులు, న్యాయవాదులను పోలీస్ కమిషనర్ అభినందించారు.

# బీసీ డిమాండ్ల సాధనకై 24గంటల నిరవధిక దీక్ష..




**మంచిర్యాల,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతున్నాయని నిరసనగా బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంచిర్యాల పట్టణంలోని గాంధీ పార్కులో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం 24గంటల నిరవధిక దీక్ష చేపట్టారు.ఈ దీక్షను న్యూఇండియా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ జెవి రాజు,బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెద్దంపేట శంకర్,తెలంగాణ గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు నిన్నెలా నరసయ్య,జాతీయ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్‌లు దీక్షలో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ...గత నాలుగు దశాబ్దాలుగా బీసీల హక్కుల కోసం పోరాటాలు కొనసాగుతున్నప్పటికీ, కేంద్రంలో కాంగ్రెస్,ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో గతంలో ఉన్న టీఆర్ఎస్,ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీ డిమాండ్లను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు.పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం,ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో బీసీ రక్షణ చట్టం తీసుకురావడం, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు,50శాతం రిజర్వేషన్ పరిమితి ఎత్తివేత,ఉద్యోగాల్లో పదోన్నతుల్లో రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి కామారెడ్డి డిక్లరేషన్ అమలు,ఎన్నికల మేనిఫెస్టోలోని బీసీ హామీల అమలు,ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు,బీసీ సబ్ ప్లాన్ అమలు,బీసీ యాక్ట్ ఏర్పాటు, ఐదేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ కేటాయింపు వంటి డిమాండ్లు ఉన్నాయని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కర్రె లచ్చన్న,గజ్జెల్లి వెంకటయ్య,వేముల అశోక్,వెన్నెల నరసయ్య, పెద్దంపేట శంకర్,డాక్టర్ జెవి రాజు,రామగిరి రాజన్న చారి, కొత్తకొండ రమేష్,మంచెర్ల సదానందం, చంద్రగిరి చంద్రమౌళి,కీర్తి బిక్షపతి,డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్,ఎర్రోళ్ల రాజు,సురేంద్ర చారి,శెట్టిపల్లి ఘట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ కాలవలో ప్రాణాపాయంలో గోమాత...



ప్రాణాలకు తెగించి కాపాడిన రానా





**ఖమ్మం,ఏప్రిల్07(సూర్యరేఖ)** మానవత్వం ఇంకా సజీవంగా ఉందనే నిదర్శనంగా నిలిచే ఘటన మండల పరిధిలోని రఘునాథ బంజర గ్రామ సమీపంలో చోటుచేసుకుంది.సాగర్ కాలవలో ప్రమాదవశాత్తు పడిపోయి ప్రాణాపాయంలో కొట్టుమిట్టాడుతున్న గోమాతను ప్రాణాలకు తెగించి కాపాడిన రఘునాథ గూడెం సర్పంచ్ భర్త రానా ధైర్యసాహసం స్థానికులను కట్టిపడేసింది. వివరాల్లోకి వెళితే...కాలవలో చిక్కుకుని బయటపడలేక అలమటిస్తున్న గోమాతను గమనించిన రఘునాథ గూడెం గ్రామ సర్పంచ్ కుక్కా సుధారాణి భర్త రానా క్షణం ఆలస్యం చేయకుండా స్పందించాడు.పరిస్థితి తీవ్రతను అంచనా వేసిన ఆయన వెంటనే కాలవలోకి దూకి గోమాతను రక్షించే ప్రయత్నం ప్రారంభించాడు. అయితే భయంతో వణికిపోయిన గోవు దగ్గరకు రానీయకపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర కాలవలో ఈదుకుంటూ వెంబడించాల్సి వచ్చింది.ఇరువైపులా సైడ్ వాల్స్ ఉండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారినా,తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రానా పోరాటం కొనసాగించాడు.చివరికి కొంత వెసులుబాటు ఉన్న ప్రదేశానికి చేరుకున్న తర్వాత స్థానికుల సహకారంతో తాళ్లను ఉపయోగించి గోమాతను సురక్షితంగా ఒడ్డుకు లాగారు.ఈ క్రమంలో గోవు భయంతో వెనుక కాళ్లతో తన్నినా,రానా ఏమాత్రం వెనుకడుగు వేయకుండా తన ధైర్యాన్ని చాటుకున్నాడు.ప్రాణాపాయంలో ఉన్న మూగజీవాన్ని కాపాడిన రానా ధైర్యసాహసం గ్రామంలో ప్రశంసల వర్షం కురిపిస్తోంది.గ్రామ అభ్యున్నతికి కృషి చేయడమే కాకుండా,కరుణా హృదయంతో గోమాత ప్రాణాలు రక్షించిన ఆయనను స్థానికులు,ప్రయాణికులు ఘనంగా అభినందించారు.ఈ రక్షణ కార్యక్రమంలో కుక్కా లాలు,పోతురాజు రాము,అంజారావు,రావుల సీతయ్య,బండి వెంకయ్య,నల్లగొర్ల నాగేశ్వరరావు ,కుక్క శ్రీనివాసరావు,కొలికపోగు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని విధులు కల్పించండి..





**మందమర్రి,ఏప్రిల్07(సూర్యరేఖ)**సింగరేణి కాంట్రాక్ట్ సెక్యూరిటీ కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని విధులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పోరాటం రోజురోజుకు ఉధృతమవుతున్నాయి.తమను ఎలాంటి షరతులు లేకుండా యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మందమర్రి పట్టణంలో ఎస్ అండ్ పిసి కాంట్రాక్టు కార్మికులు రెండవ రోజు కూడా భారీ ర్యాలీ నిర్వహించారు.మంగళవారం సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు.కోల్ బెల్ట్ ఏరియా పరిధిలోని పాల చెట్టు ఏరియా కాలనీ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహిస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ... మందమర్రి డివిజన్‌లో పనిచేస్తున్న సుమారు 220 మంది ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.గత పన్నెండు సంవత్సరాలుగా నిరంతరం విధులు నిర్వహిస్తున్న కార్మికులను కొత్త టెండర్ల పేరుతో విధుల నుంచి దూరం చేయడం అన్యాయమని ఆరోపించారు. టెండర్ ప్రక్రియను కారణంగా చూపుతూ కార్మికులను మభ్యపెడుతున్నారని, ఇప్పటికే నెలరోజులు గడిచినా సమస్యకు పరిష్కారం కనిపించడం లేదని ఆయన తెలిపారు.సంస్థ ఆస్తులను కాపాడే బాధ్యత వహిస్తున్న సెక్యూరిటీ గార్డులకే ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.తక్షణమే యాజమాన్యం స్పందించి,ఎలాంటి షరతులు లేకుండా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.ఈ ర్యాలీలో సింగరేణి కాంట్రాక్ట్ సెక్యూరిటీ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డిని భాగ్యనగర్ తండా గ్రామ ప్రజలు కలిశారు.



**కారేపల్లి,ఏప్రిల్07(సూర్యరేఖ)** భాగ్యనగర్ తండా గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డిని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హచ్చు (హర్షనాయక్)కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పరిధిలోని భాగ్యనగర్ తండా మరియు సమీపంలోని ఐదు తండాలకు చెందిన రైతులు,రైతు కూలీలు ప్రతిరోజూ వ్యవసాయ పనుల నిమిత్తం రైల్వే ట్రాక్ దాటి తమ పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు.రైల్వే అధికారులు ట్రాక్ దాటేందుకు అనుమతి నిరాకరిస్తుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు వినతులు సమర్పించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.రైల్వే ట్రాక్‌ను అనుమతి లేకుండా దాటితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారని,దీంతో ప్రజల్లో భయం నెలకొన్నదన్నారు.అందువల్ల జరుపుల బాలాజీ చేను సమీపంలోని రైల్వే స్తంభం నెంబర్ కెఎస్/5/5 వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి లేదా రైల్వే గేట్ ఏర్పాటు చేయించాలని ఎంపీ రామసాయం రఘురాంరెడ్డిని కోరినట్లు తెలిపారు.ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని ఎంపీ శ్రీరామస హాయం రఘురాంరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## రైల్వే డబుల్ లైన్ భూసేకరణకు పరిహారం పెంపు..

రైతుల వినతిపై అధికారుల సానుకూల స్పందన..

సర్పంచ్ రంజిత్ కుమార్



**కారేపల్లి ఏప్రిల్ 07(సూర్యరేఖ)** సింగరేణి మండల పరిధిలోని కోమట్లగూడెం గేట్--కారేపల్లి,కమలాపురం రెవెన్యూ పరిధిలో డోర్నకల్ నుంచి భద్రాచలం రోడ్ వరకు ప్రతిపాదిత రైల్వేడబుల్ లైన్ ప్రాజెక్ట్‌కు సంబంధించి భూనిర్వాసిత రైతుల పరిహారం అంశంపై కలెక్టర్ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. సమావేశంలో మూడు రెవెన్యూ పరిధుల రైతులు, గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్,కమలాపురానికి చెందిన కోటి అప్పారావు, పాండియానాయక్,మహిళా రైతులు పాల్గొన్నారు.భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.19లక్షల పరిహారం ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.అధికారులు స్పందిస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎకరానికి రూ.18 లక్షల పరిహారం అందించే అవకాశం ఉన్నట్టు వెల్లడించారు. దీనిపై రైతులు చర్చించి,ఎకరానికి రూ.18 లక్షల 50 వేల పరిహారం ఉంటే అంగీకారమని స్పష్టం చేశారు. ఈ మేరకు రైతులు తమ వినతి పత్రాలను ఎస్‌డీసీకి సమర్పించారు.రైతుల అభ్యర్థనలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనుకూల నిర్ణయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. రైతుల సమస్యలపై అధికారులు స్పందించిన నేపథ్యంలో పరిహారం విషయంలో త్వరలో తుది నిర్ణయం వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి

## ఎమ్మెల్యే పిఎస్ఆర్ చేతుల మీదుగా అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ..



**మంచిర్యాల,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మంచిర్యాల నియోజకవర్గంలో అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కీలక అడుగు పడింది.స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన మొత్తం 423మంది అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు అందజేశారు. టీచర్లు తమకు అందించిన సహకారం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో అంగన్వాడీ సేవలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా అమలవుతాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు సమర్థంగా చేరవేయడంలో ఈ మొబైల్ ఫోన్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ పంపిణీ ద్వారా టీచర్లు పిల్లల ఆరోగ్యం,పోషణ,హాజరు వివరాలు వంటి అంశాలను సులభంగా నమోదు చేసి ఉన్నతాధికారులకు చేరవేయగలరని అధికారులు తెలిపారు. దీంతో సేవల నాణ్యత మరింత మెరుగుపడే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకట్ రెడ్డినగర్ డివిజన్ లో అభివృద్ధి పనులకు రూ.6.20 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి..



సీఎం రేవంత్ రెడ్డి,పరమేష్ రెడ్డి,ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన అరుణ్ పటేల్,కాంగ్రెస్ నాయకులు





**ఉప్పల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)**వెంకట్ రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధి పనులకు రూ. 6.20 కోట్ల నిధులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి చొరవతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారు .కృతజ్ఞతగా ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి పరమేశ్వర్ రెడ్డి చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం చేసి అభిమానాన్ని చాటుకుని స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అరుణ్ పటేల్ మాట్లాడుతూ...నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న రేవంత్ రెడ్డి నాయకత్వం లో ఉప్పల్ మరింత ముందుకు దూసుకువెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు.వెంకట్ రెడ్డినగర్ డివిజన్ పరిధిలో జరగబోయే పనుల వివరాలను వెల్లడించారు.వెంకట్ రెడ్డినగర్ డివిజన్ శివాజీ విగ్రహం నుండి వెంకట్ రెడ్డినగర్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 1.50 కోట్లు,విశాల్ మార్ట్ నుండి పాలిటెక్నిక్ కాలేజ్ -2 గేట్ వరకు రూ.90 లక్షలు, గాంధీనగర్ రోడ్ నెం-2 శ్రీనగర్, సత్యనగర్, కామాక్షి పురం,వివేక్ నగర్, రాంరెడ్డినగర్ మెయిన్ రోడ్ నుండి అంబర్‌పేట్ ఎస్టిపి వరకు (ఫేస్ -×)రోడ్డు నిర్మాణానికి రూ. 1.20కోట్లు,ఏడిఆర్ఎం హాస్పిటల్ ఓల్డ్ రామంతపూర్ నుండి శ్రీనగర్ కాలనీ వరకు రూ.2.60 కోట్లు నిధులను కేటాయించినట్లు తెలిపారు.మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఈ నిధులు ఎంతో దోహదపడతాయి.త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిల్లకంటి యాదయ్య,ఉపేందర్ రెడ్డి,శంకరయ్య, యూత్ కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా జనరల్ సెక్రటరీ కిషోర్,బాలయ్య శ్రీనివాస్ చారి,గడ్డం నరసింహ,కె. స్వామి,గలుసుల స్వామి,కసీమ్ గౌడ్,మల్లయ్య, కొమురయ్య,అశోక్, సచిన్,వినిష్,రఘు, అలీ,నాగచారి,కృష్ణ, సతీష్, నాగరాజు, కనకయ్య, వెంకన్న,మట్ట అంజయ్య, గంగారం, నారాయణ, సోమయ్య, బిలకంటియాదగిరి,అశోక్,నవీన్ దేవయా మల్లేష్,లింగం,పాల బాలయ్య,రాజేష్, భాను,అలీ, భాష,నాని, శివ, శ్రీకాంత్,చిరు,భాస్కర్,నాగమల్లయ్య,రాజేష్,నాని, సురేష్,మహిళా కాంగ్రెస్ నాయకులు లక్ష్మిమునగాల, సంధ్య,గోవింద,ధనలక్ష్మి,పావని, విజయ, సునీత,ప్రవీణ,శోభ, ధనుశ్రీ,మాధవి, పల్లవి, కాంగ్రెస్ నాయకులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ముదిరాజ్ సంఘ భవనానికి మహార్దశ..రూ.62లక్షల నిధులతో అభివృద్ధి పనులు





పనులను పర్యవేక్షించిన పరమేశ్వర్‌రెడ్డి, రజితాపరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** ఉప్పల్‌లోని ముదిరాజ్ సంఘం భవనానికి మంచిరోజులొచ్చాయని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్ట ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సంఘ భవనం కోసం రూ.62లక్షల నిధులను మంజూరు చేయించినట్టుగా చెప్పారు. పరమేశ్వర్‌రెడ్డి,ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి,లతో కలిసి ముదిరాజ్ భవన్‌కు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు.కాలనీలలో కమ్యూనిటీ హాళ్లను,కుల సంఘాల భవనాలను పూర్తి స్థాయిలో నిర్మాణాలను చేయిస్తున్నట్టుగా చెప్పారు. ఇదే కాకుండా గతంలో మిగిలిన పెండింగ్ పనులను సైతం పూర్తి చేయిస్తున్నట్టుగా తెలిపారు.రానున్న రోజుల్లో మరిన్ని నిధులను తెప్పించి ఉప్పల్ ముదిరాజ్ సంఘ భవనాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేలా చూస్తామన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.కోట్ల నిధులను తెచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి పాల్పడుతున్నట్టుగా తెలిపారు.రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అన్ని రకాల పనులను చేపడుతూ ఉప్పల్ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్టుగా చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బోరంపేట రమేష్, మహంకాళి కృష్ణ,ఈగ లక్ష్మణ్, ఈగ ఈశ్వరయ్య ,పిట్టల సాయిలు,గంగాదేవి కరుణాకర్,ఈగ బాబు, మంద శేఖర్,బోరంపేట రాము,తలారి వినయ్, కావలి రాము,రంగుల శేఖర్, అరటికాయల మల్లేష్,కంచె మీది రవీందర్ ముదిరాజ్,కశీచె మీది శివయ్య,కోకొండ జగన్, రాపాక నర్సింగ్,ఈగ మురళి,కాయల శీను, మహంకాళి వేణు,మహంకాళి రాజు,కావలి హరి, ఈగ రాజేష్,బోరంపేట రవి,తలారి కస్తూరి లక్ష్మణ్,దాడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన హబ్సీగూడ నేతలు

**సీఆర్ఎంపీ కింద హబ్సీగూడకు రూ.21.60కోట్లు కేటాయింపు..**

**ఉప్పల్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన నేతలు**





**ఉప్పల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** సీఆర్ఎంపీ కార్యక్రమంలో భాగంగా హబ్సీగూడ డివిజన్ రోడ్ల మరమ్మతులు,నూతన రోడ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం రూ.21.60 కోట్లు హబ్సీగూడ క్రాస్ రోడ్ నుండి ఉప్పల్ క్రాస్ రోడ్ వరకు రూ.12కోట్లు, ఉప్పల్ క్రికెట్ స్టేడియం అంతర్గత రహదారి కొరకు రూ. 2 కోట్ల10 లక్షలు,ఎన్జీఆర్ఐ మెట్రో స్టేషన్ నుండి మధుర రెస్టారెంట్ వరకు రూ.3కోట్ల20 లక్షలు,ఏక్ మినార్ మసీదు నుండి రామంతాపూర్ రోడ్ వరకు రూ. 2కోట్ల 60 లక్షలు,హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నుండి సాయి బాబా టెంపుల్ వరకు రూ.1కోటి 70 లక్షలు కేటాయించిన సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు హబ్సీగూడ డివిజన్ నేతలు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.హబ్సీగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్ట్రీట్ నెంబర్ -8స్వాతి టిఫిన్స్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... హబ్సీగూడ డివిజన్ కు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంత భారీ ఎత్తున నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి,జిల్లా ఇంచార్జ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ఆర్ అండ్ బీ మినిస్టర్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,లకు,ముఖ్యంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మందుముల పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి,జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్,డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్ కుమార్,సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి,మురళీ కృష్ణముదిరాజ్,గుండు రాజన్న, భూక్యా కిషన్ నాయక్,రాజు నాయక్,రమేష్ నాయక్,మాలు నాయక్,డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసు నాయక్,సుమన్ నాయక్,లక్ష్మీ నారాయణ,శివ,రంజిత్, మధు,వేణు, సాయి,గణేష్, రాహుల్, రాహూల్ నాయక్,బి.శివ,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీపై దాడి చేసిన బీజేపీ నాయకులను అరెస్ట్ చేయాలి..

**హత్యాయత్నం కేసు 307(బిఎన్ఎస్) నమోదు చేసి అరెస్టు చేయకుంటే జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.!**

**రాజకీయ లబ్దికోసం పార్లమెంటులో మాట్లాడే ఎంపీ డీకే అరుణ ఈ ఘటన పై నోరు మెదపరెందుకు.?**

**ఎస్సీ కులాలు మీకు ఓట్లేసే యంత్రాలు మాత్రమేనా.?**

**నిందితులకు కొమ్ము కాస్తున్న కృష్ణా ఎస్సైని సస్పెండ్ చేయాలి.!**

**రాజకీయ నాయకుల మెప్పుకోసం చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న పోలీస్ అధికారులు.!**

**బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్..**



**ధన్వాడ,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** నారాయణపేట జిల్లా కృష్ణా మండలం,చేగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ లింగప్పపై అదే గ్రామ బీజేపీ నాయకులు దాడి చేసి హత్యా యత్నం చేసిన బీజేపీ నాయకులపై 307(బిఎన్ఎస్)సెక్షన్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని బాహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)నారాయణపేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.మంగళవారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఎస్సీ కులానికి చెందిన మాజీ ఎంపీపీ లింగప్పపై అకారణంగా దాడి చేసి చంపే ప్రయత్నం హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాల్సిన స్థానిక ఎస్సై రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నిందితులకు కొమ్ము కాయడం అత్యంత దుర్మార్గమన్నారు.ఘటన జరిగి పది రోజులు గడుస్తున్నా నిందితులపై307సెక్షన్ ఎందుకు నమోదు చేయలేదో ఎస్సై సమాధానం చెప్పాలన్నారు.రాజకీయ లబ్ది కోసం పార్లమెంటులో మాట్లాడే స్థానిక ఎంపీ డీకే అరుణ ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదో చెప్పాలన్నారు.తక్షణమే హత్యాయత్నం కింద నిందితులను అరెస్టు చేయకుంటే జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.


## రాఘవపూర్ లో మద్య నిషేధం..

**మద్యం అమ్మితే రూ.50వేలు జరిమానా**



**కామారెడ్డి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** కామారెడ్డి మండలం రాఘవపూర్ లో మద్యపాన నిషేధానికి గ్రామస్తులంతా ఏకతాటిపై వచ్చి మద్యం అమ్మితే రూ.50వేల జరిమానా మద్యం తాగితే రూ.10వేలు జరిమానా విధిస్తున్నట్లు గ్రామస్తులంతా ఏకగ్రీవ తీర్మానం మంగళవారం నాడుచేసుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ వినీల నరేష్ మాట్లాడుతూ...మద్యపానానికి అలవాటు పడి యువత ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని, యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.రేపటినుండి అనగా బుధవారం నుండి ఇట్టి తీర్మానం అమల్లోకి వస్తుందని సర్పంచ్ వినీల నరేష్ తెలిపారు.ఇట్టి తీర్మానం కాపీలను కామారెడ్డి తహసిల్దార్, పోలీసులకు,ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కు ఇట్టి తీర్మాన కాపీలను ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో రాఘవపూర్ ఉపసర్పంచ్ గుగులోతు నరేష్,వార్డు మెంబర్లు గుగులోతు సుజాత,కిషన్, గుగులోతువసంత,గ్రామ సంఘం అధ్యక్షురాలు మంద లక్ష్మి,గ్రామ పెద్దలు సిద్దయ్య నాయక్,భాష, లక్ష్మణ్,రామగౌడ్, స్వామి,రవి,శేఖర్ తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన వ్యక్తికి రూ.10వేల జరిమానా..




**నిజాంపేట,ఏప్రిల్07 (సూర్యరేఖ)** మండల పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపినందుకు నాందేడ్‌కు చెందిన చౌహన్ బాలాజీ, కాసింపూర్ తండా పరిధిలో నివసిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకొని మొబైల్ కోర్టున్యాయమూర్తి సాయి ప్రభాకర్,విచారణ జరిపి రూ.10వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా నిజాంపేట ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ...మద్యం సేవించి వాహనం నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.ముఖ్యంగా యువత ఇటువంటి తప్పిదాలకు పాల్పడితే,భవిష్యత్తులో పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు ఎదురవడం, ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయన్నారు.ప్రజలు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించి,మద్యం సేవించి వాహనం నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నేర సమీక్షా సమావేశం..

## నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు..

## పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష..

## వేగవంతమైన దర్యాప్తుకు సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు..



**మంచిర్యాల,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు.మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన పెండింగ్ కేసులు,నిందితుల అరెస్టులు,దర్యాప్తులో ఉన్న కేసులు,వారెంట్ల అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.పాత పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిన సీపీ, దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను తెలుసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని తెలిపారు.దొంగతనాల నివారణకు ఆధునిక సాంకేతికత వినియోగం పెంచాలని, రికవరీ శాతం మెరుగుపరచి బాధితులకు వారి సొత్తు తిరిగి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చోరీలకు పాల్పడే వ్యక్తులపై హిస్టరీ షీట్లు తెరవడంతో పాటు,నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే ఉన్న కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని స్టేషన్ అధికారులకు ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని,"అరైవ్-అలైవ్"కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు.మహిళలు ,చిన్నారులు,వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు .పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాల ద్వారా పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు .గంజాయి, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినచర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి,అడిషనల్ డీసీపీ (అడ్మిన్)కె .శ్రీనివాస్,గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు,బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ ( హెచ్ డిఎస్) సమావేశం..

హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి



**కామారెడ్డి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు సమావేశం ప్రారంభంలో సభ్య కార్యదర్శి/సూపరింటెండెంట్ హాజరైన సభ్యులను ఆహ్వానించారు. సమావేశంలో చర్చించిన ముఖ్యాంశాలు.. గత సమావేశపు నిమిషాలను పరిశీలించి,తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు.చేపట్టిన పనుల్లో సుమారు 99 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు. హెచ్‌డీఎస్ నిధుల ఆర్థిక స్థితిపై వివరాలు అందించారు.సుమారు రూ.18 లక్షలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.అందులో రూ.10 లక్షలు క్యాన్సర్ కేర్ మరియు పాలియేటివ్ సేవలకు కేటాయించగా,రూ.2లక్షలు హాస్పిటల్ క్యాంటీన్ కాషన్ డిపాజిట్‌గా వినియోగించినట్లు తెలిపారు. మిగిలిన నిధులను పెండింగ్ పనుల కోసం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా వినియోగించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే కేసీఆర్ కిట్ అమలు తర్వాత ప్రసూతి కేసుల పెరుగుదలపై వివరాలు కోరడంతో పాటు ట్రామా కేసుల గణాంకాలను సమర్పించాలని సూచించారు.హాస్పిటల్‌లో సీటీ స్కాన్ సౌకర్యం లేకపోవడం వల్ల ట్రామా రోగులను ఇతర ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోందని చర్చించారు. ప్రస్తుత టి-హబ్ భవనంలో సీటీ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు రాజన్న సింగిల్ డోనర్ ప్లేట్లెట్స్ (ఎస్ డిపి) అందుబాటులో లేకపోవడంపై ప్రస్తావించారు. యంత్రం ఉన్నప్పటికీ ప్రతి యూనిట్‌కు సుమారు రూ.8000 వ్యయం అవుతున్నందున ఆర్థిక పరిమితులు ఉన్నట్లు తెలిపారు.దీనిపై ఎమ్మెల్యే ఇండెంట్ పంపించాలని,అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ముఖ్య తీర్మానంగా జీజీహెచ్ ఆసుపత్రిని కొత్త భవనానికి మార్చే అంశంపై చర్చించారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు..

వార్డు సభ్యుల శిక్షణ తరగతులను పర్యవేక్షించిన

స్వయంగా వైద్య పరీక్షలు నిర్వహించుకున్న

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్..







**నిజాంపేట,ఏప్రిల్07(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనములో మంగళవారం నూతన వార్డు సభ్యుల శిక్షణ తరగతులను మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సందర్శించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి 99వ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 7ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్,తో పాటు వార్డు సభ్యులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వార్డు సభ్యులు ఆరోగ్యంగా ఉంటే గ్రామస్తులంతా ఆరోగ్యవంతులుగా ఉంటారని అడిషనల్ కలెక్టర్ అన్నారు.గ్రామాలు అభివృద్ధి చెందాలంటే వార్డు సభ్యుల పాత్ర కీలకమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తుందన్నారు.ఈ చక్కటి అవకాశాన్ని వార్డు సభ్యులు సద్వినియం చేసుకొని తమ తమ గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు.అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా జనగణన,రెవెన్యూ సమస్యల పరిష్కారం,3నెలల రేషన్ సరుకుల పంపిణీపై తహశీల్దార్ శ్రీనివాస్‌తో చర్చించారు. లబ్ధిదారులందరూ తమకు కేటాయించిన రేషన్ సరుకులను తీసుకోవాలని సూచించారు.రేషన్ షాపులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో రాజిరెడ్డి,డిప్యూటీ తాహసిల్దార్ రమ్యశ్రీ,ఎంపీఓ వెంకట నరసింహారెడ్డి,ఆర్ఐ ప్రీతి, కంప్యూటర్ ఆపరేటర్ వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్,వివిధ గ్రామాల కార్యదర్శులు,వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి..



**నిజాంపేట,ఏప్రిల్07(సూర్యరేఖ)** మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో మంగళవారం మెదక్ జిల్లా దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు కుమ్మరి కుమార్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో పెన్షన్ పెంపుదల కోసం దివ్యాంగులకు ఇందిరమ్మ ఇల్లు,అంతోదయ కార్డులతో పాటు రాజకీయ రిజర్వేషన్లలో ఐదుశాతం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీదేవి, బాచుపల్లి పాండు,వస్రం నాయక్,భూమయ్య, శ్రీనివాస్, గంగవ్వ, యాదగిరి,రాజమణి,తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులు..



**నిజాంపేట,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మండల పరిధిలోని చౌకత్ పల్లి గ్రామంలో మంగళవారం గ్రామానికి చెందిన సంపంగి రాధ,కు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి స్లాబ్ పోయడం జరిగింది.ఇందిరమ్మ ఇండ్లకు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు గ్రామసర్పంచ్ సర్పంచ్ సునీత,ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జితేందర్,వార్డు సభ్యులుసూర్య,నరేష్, రామావత్ చిట్టి,బిక్షపతి, పద్మ,సురేష్,భాస్కర్, కనకరాజు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ హోమియో దినోత్సవ సన్నాహక ఉత్సవాలు..

హోమియో వాక్ ప్రారంభించిన ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. లింగరాజు





**ఉప్పల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** ప్రపంచ హోమియో దినోత్సవ సన్నాహక ఉత్సవాలలో భాగంగా జె.ఎస్.పి.ఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో మంగళవారం హోమియో వాక్ నిర్వహించడం జరిగింది. హోమియో పతి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఆయుష్ అడిషనల్ డైరెక్టర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. లింగరాజు వాక్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.లింగరాజు మాట్లాడుతూ...యువ హోమియో వైద్యులు అంకిత భావంతో జాతికి హోమియో వైద్యం ద్వారా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.డాక్టర్ అయిన హనీమన్ ఆనాటి అల్లోపతి వైద్యంలో నెలకొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని,రోగికి మందుల దుష్ప్రభావాలు లేకుండా,స్వస్థత చేకూర్చడానికి తక్కువ ఖర్చుతోనే అందరికీ అందుబాటులో ఉండే విధంగా తీసుకు వచ్చిన వైద్య ప్రక్రియే హోమియోపతి వైద్యమని పేర్కొన్నారు.జర్మనీలో 1755 ఏప్రిల్ 10వ తేదీన జన్మించిన శామ్యూల్ హానిమన్ స్మృత్యర్థం ఏటా ఏప్రిల్ 10వ తేదీన ప్రపంచవ్యాప్తంగా 'హోమియోపతి దినోత్సవం'గా జరుపుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ దాసరి పార్థసారథి,వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్.రాజేశ్వర్ రావు,డాక్టర్ కృష్ణమూర్తి, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగేంద్రస్వామి 27వ వార్షికోత్సవం..

### అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి దీవెనలు పొందిన భక్తులు..

### ప్రత్యేక పూజలు,మొక్కులు చెల్లింపు







**మరిపెడ,ఏప్రిల్ 07(సూర్యరేఖ)**మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఆనేపురం నాగేంద్రస్వామి 27వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం చైత్ర మాసం బహుళ పంచమి రోజున ఆలయ చైర్మన్ గుగులోత్ అమృనాయక్, ఆలయ నిర్వాహకులు,భక్త మండలి సభ్యులు ఆలయ వార్షికోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహిస్తుంటారు.ఈ వార్షికోత్సవంలో భాగంగా వెంకట్యా తండా సర్పంచ్ గుగులోత్ కాంతమ్మ, అమృ నాయక్ దంపతుల ఆధ్వర్యంలో ఆనేపురం గ్రామ పురోహితులు బైరోజు యాకాంబ్రాచార్యులు, రాగి నితినాచార్యులు ఆలయ ముఖ పూజ, పుణ్యాహవాచనం,రుత్వికరణ,యాగశాల ప్రవేశం, నవగ్రహ,మూలమంత్రహవనం ,అష్టది క్వాలక బలి ప్రధానం,పూర్ణాహుతి ,మహానివేదన ,సాయంత్రం బండ్లు తిరుగుట,స్వామివారి ఏకాంత సేవ కార్యక్రమాలు,మహా మంగళ హారతి,శయన హారతి తదితర పూజలు నిర్వహించారు.ఈ పూజ కార్యక్రమాలలో అనేపురం సర్పంచ్ మల్లికంటి వసుమతి,యాకన్న దంపతులు,మాసబత్తిని శోభ, సతీష్ దంపతులు,గుగులోత్ రవీందర్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ వార్షికోత్సవం సందర్భంగా జరిగే జాతరకు చుట్టు ప్రక్కల పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.సాయంత్రం ఆలయ ప్రాంగణంలో బండ్లు తిరుగుట(ప్రభ బండ్లు)కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.జాతర సందర్భంగా పోటెత్తిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.అనంతరం ఆలయ చైర్మన్ గుగులోత్ అమృ నాయక్ మాట్లాడుతూ...భక్తులకు వరాలిచ్చే దేవుడిగా ఆనేపురం నాగేంద్రస్వామికి పేరుందని తెలిపారు.స్వామివారి దయతో సకాలంలో సంవృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషంతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ భక్త మండలి సభ్యులు, భక్తులు,మహిళలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు ఒక్కపూట పనికి అనుమతినివ్వండి..





టియుసిఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి

**మరిపెడ,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మున్సిపల్ కార్మికులకు ఒక్కపూట పనికి అనుమతినివ్వాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు,టియుసిఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి కోరారు.గత వారం రోజులుగా పగటిపూట భారీగా పెరిగిన ఎండల కారణంగా మున్సిపల్ కార్మికులకు ఒక పూట పనికి అనుమతినివ్వాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, కమిషనర్ విజయానంద్ లకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ గత వారం రోజులుగా 35డిగ్రీల సెల్సియస్ ఎండలు పెరిగినందున మధ్యాహ్నం రెండు గంటలకు డ్యూటీ చేయడానికి వచ్చే కార్మికులపై ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని అన్నారు.పెరిగిన ఎండలలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు శరీరంలో నీటి నిలువలు తగ్గిపోయి ఎండ దెబ్బ,వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు.శరీరంలో నీటి నిలువలు తగ్గి ప్రాణాపాయ ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.పారిశుద్ధ కార్మికుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉదయం 5గంటల నుండి12 గంటల వరకు ఒక్క పూట పనికి అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు.వీలైన తొందరలో ఒక పూట పనిని అమలు చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్,కమిషనర్ లు హామీ ఇచ్చినట్లు రవి తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు బానోత్ రాంలాల్,బయ్య భిక్షం,ఉపేందర్,నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున్ నగర్ సివరేజ్,ఎస్ డబ్ల్యూడి ట్రంక్ లైన్ పై కబ్జాలను వెంటనే తొలగించాలి..







మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

ప్రజలకు ఇబ్బంది కలగకుండా నూతన సీవరేజ్ మరియు ఎస్ డబ్ల్యూడి ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాలి..

మాజీ కార్పొరేటర్ బన్నాల గీత

**ఉప్పల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మల్లికార్జున్ నగర్ సివరేజ్ ఎస్ డబ్ల్యూడి ట్రంక్ లైన్ పై కబ్జాలను వెంటనే తొలగించి ఎస్డబ్ల్యూడి ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మంగళవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శైలజ ని కలిసి వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు.చిలుకానగర్ డివిజన్ లోని మల్లికార్జున్ నగర్ బొొడ్రాయి ప్రాంతంలో ఉన్న ప్రజలతో కలిసి నూతన సివరేజ్ పైప్ లైన్ (ఎస్ డబ్ల్యూడి)స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ ఏర్పాటు చేయాలని ఎదురవుతున్న సమస్యలను డిప్యూటీ కమిషనర్ కు వివరించారు .అనంతరం మాజీ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ డిప్యూటీ కమిషనర్ శైలజతో మాట్లాడుతూ. ..మల్లికార్జున్ నగర్ చిల్కానగర్ గుట్ట పైనుండి మరియు బొొడ్రాయి ప్రాంతం నుండి వచ్చే సివరేజ్ మరియు వర్షపునీరు పోవడానికి పాత పైప్ లైన్ ఉన్నదని దానిని కొంతమంది ప్రైవేట్ ప్రాపర్టీ ఓనర్స్ పైప్ లైన్ పైన కబ్జా చేసి నిర్మాణాలు చేశారని వాటిని వెంటనే తొలగించాలన ,పురాతనమైన పైప్ లైన్ ని కొత్త పైపులైన్ తో మార్చి కొత్త ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాలని దానిని ఇరిగేషన్ నాళాలో కలిపే విధంగా చర్యలు చేపట్టాలని వారికి కొన్ని ఫోటోలు చూపిస్తూ వివరించడం జరిగింది.అదేవిధంగా పైప్ లైన్ల పైన నిర్మాణాలు చేయడం వల్ల సీవరేజ్ వాటర్, వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేక ఇళ్ళ ముందు అంత మురికి నీరు నిండిపోవడం ప్రజలకు ఇళ్లలోంచి బయటకు రాకుండా తీవ్ర అంతరాయం కలిగి ప్రజా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు.డిప్యూటీ కమిషనర్ శైలజ స్పందిస్తూ వెంటనే వాటర్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజతో కలిసి ఆప్రాంతంలో పర్యటించి వీలైనంత తొందరలో నూతన పైపు లైన్ నిర్మించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని,పైప్ లైన్ పైన నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలో సహించబోమని వాటిని వెంటనే తొలగిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో డి.ఈ.వెన్నెలగౌడ్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎదుల్ల కొండల్ రెడ్డి,జల్లి మోహన్,మౌలాలి,శ్యామ్,బంటి గౌడ్,బస్తి వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఖమ్మం ఎంపీ రఘురామరెడ్డి 36 మందికి,రూ 8.81 లక్షల చెక్కులు పంపిణీ..



**కారేపల్లి,ఏప్రిల్07(సూర్యరేఖ)** సింగరేణి మండల పరిధిలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు ఎంపీ రామసాయం రఘురామ రెడ్డి, చేతుల మీదుగా సుమారు 36 మందికి రూ.8.81లక్షల చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ... సింగరేణి మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని,ఏ సమస్య వచ్చిన నేరుగా వచ్చి కలవచ్చు,అని అన్నారు.మండల సర్పంచ్ లు అభివృద్ధికి దరఖాస్తులు ఇచ్చారు.వారి దరఖాస్తు పరిశీలించి గ్రామపంచాయతీకి అభివృద్ధి పథంలో తీర్చిదిద్దే విధంగా పని చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు,మండల అధ్యక్షులు తలారి చంద్ర ప్రకాష్,నరేష్ నాయక్,సర్పంచ్,లు అజ్మీరా ఉమా, నరేష్,వడ్డే సులోచన రంగారావు,మోతె వీరస్వామి.ధరావత్ వెంకటేశ్వర్లు,గూగులోతు కృష్ణవేణి,వీరబాబు,దండు ప్రవీణ్,ఉండం రాఘవులు, దరావత్ హేమలత బాలాజీ,గూగులోతు వరలక్ష్మీరాజు ,భద్రం.బానోత్ పద్మ రూప్లా,పొడుగు పెంటయ్య.వార్డ్ మెంబర్ ఆదేర్ల అంజయ్య,పాటి నర్సయ్య,నాయకులు తోగర శ్రీను,జర్పుల ధోనీ నాయక్,ఈసం లక్ష్మీనర్సు,హర్ష నాయక్,నరేష్,బద్దె నాయక్,రవీందర్ రెడ్డి ,రెడ్డబోయిన జగ్గయ్య,గుంపిడి నాగేశ్వరావు,తదితరులు, పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉప్పల్ ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ..

ర్యాలీని ప్రారంభించిన ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌశీల్యరాణి




**ఉప్పల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డాక్టర్ సౌశీల్యరాణి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఆరోగ్యం కోసం కలిసి నిలబడదాం.. శాస్త్ర విజ్ఞానానికి అండగా నిలుద్దాం ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు వెల్లడించారు.ఈ ఏడాది థీమ్,రుజువు-ఆధారిత నిర్ణయాలు ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడంలో శాస్త్రీయ సహకారం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తుందన్నారు. “వన్ హెల్త్”విధానంపై దృష్టి కేంద్రీకరిస్తూ, మనుషులు,జంతువులు,పర్యావరణ ఆరోగ్యం పరస్పరం ముడిపడి ఉన్నాయని ఈ థీమ్ తెలియజేస్తుందని స్పష్టం చేశారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ముఖ్యఉద్దేశ్యం తప్పుడు సమాచారాన్ని అడ్డుకుని,శాస్త్రీయ విజ్ఞానంతో ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవడం కోసమేనన్నారు.ప్రజారోగ్య సమస్యలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాంసుందర్,ఫార్మసిటికల్ విభాగం నగేష్, ఉప్పల్ మెడికల్ సిబ్బంది,ఆశ వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం..

పెద్ద సంఖ్యలో తరలిన భక్తులు,బోనాల సమర్పణ

భక్తిశ్రద్ధలతో మొక్కుల చెల్లింపు..

మూలమర్రితండా జీపి పరిధిలోని మంచాతండాలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికశోభ..



**మరిపెడ,ఏప్రిల్07(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం మూలమర్రితండా గ్రామ పంచాయితీ పరిధిలోని మంచాతం డా(సర్పంచ్ తండా)లో శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తులు,తండావాసులు ఘనంగా నిర్వహించారు.అర్చకుల ఆధ్వర్యంలోఎల్లమ్మతల్లికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయాన్నే తండాలోని మహిళలు బోనాలు నెత్తినెత్తుకొని తండా నుంచి ర్యాలీగా బయల్దేరి నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు.అనంతరం తల్లికి పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు.భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.ఎల్లమ్మ తల్లి తండాను చల్లగా చూసి,అందరూ సంతోషంగా ఉండేలా దీవించాలని,సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సంవృద్ధిగా పండి ప్రజలు,రైతులు సుభిక్షంగా ఉండేలా దీవించు తల్లి అని తండావాసులు వేడుకున్నారు.అనంతరం భక్తులకు మహా ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో తండా పెద్దలు, తండావాసులు ,మహిళలు, యువకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార కమిటీ ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా కాటేపల్లి రజినికాంత్..

హర్షించిన కల్లూరు మండల ప్రజలు..

ఆపదంటే ఆదుకునే మహానీయుడుకి అరుదైన పదవి..

**ఖమ్మం,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** ఖమ్మంలో జరిగిన జాతీయ రాష్ట్రీయస్థాయి నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది.తదుపరి, కేంద్ర, రాష్ట్రీయ నాయకుల ఆదేశాలతో గోపాలపురంలో ఎన్నికలు నిర్వహించినారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర పిఆర్ఓ జనగామ తిరుపతి పరిశీలకులుగా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గుండాగాని ఉప్పలయ్య వ్యవహరించారు.ఈ ఎన్నికలకు రాష్ట్ర అధ్యక్షులు టి.వి.పుల్లంరాజు,జోనల్ సెక్రటరీ ఇస్లావత్ నగేష్,లు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కల్లూరు మండల యువనాయకులు ఎన్నో సేవా కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వాములకు సహాయసహకారాలు అందించిన మహనీయుడు కాటేపల్లి రజనీకాంత్ కు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లాలోని నాయకులు,అయ్యప్పస్వామి భక్త బృందం పాల్గొని జిల్లా కమిటీ పాలకమండలిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటాం జరిగింది. కమిటీ మరియు పాలకమండలి కాటేపల్లి రజనీకాంత్ అధ్యక్షులు గా, లంకా అప్పలనాయుడు ఉపాధ్యక్షులుగా,కార్యదర్శిగా చిర్రా రవి,ఆళ్ల వెంకటేశ్వరరావు కోశాధికారి గా మరో 11 మంది సభ్యులను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో కాటేపల్లి రజనీకాంత్ మాట్లాడుతూ నాకు పెద్ద బాధ్యత అప్పగించిన, కేంద్ర రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి అయ్యప్ప స్వామి దయవల్ల నాకు ఈ పదవి లభించినది నేను తూచా తప్పకుండా అందరికీ నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఈ కార్యక్రమానికి వచ్చిన నాయకులకు కమిటీ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# కేకేఓసీపీ గనిలో కార్పొరేట్ జీఎం(సేఫ్టీ)పర్యటన.





భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి..

**మందమర్రి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)**సింగరేణి సంస్థ కార్పొరేట్ జీఎం(సేఫ్టీ)సాయిబాబు మంగళవారం మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (కేకే ఓసిపి)ను ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణతో కలిసి సందర్శించారు.గని అధికారులు,భద్రతా విభాగం సిబ్బంది కూడా ఈ పర్యటనలో పాల్గొని క్వారీలోని ప్రస్తుత పరిస్థితులను జీఎంకు వివరించారు.ఈ సందర్భంగా గని లోపలికి వెళ్లిన సాయిబాబు ,క్వారీలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి,ఓవర్ బర్డెన్ (ఓబి)తొలగింపు పనులను క్షుణ్ణంగా పరిశీలించారు.గనిలో ప్రస్తుత పనితీరును సమీక్షించిన అనంతరం అధికారులకు ,కార్మికులకు పలు భద్రతా సూచనలు చేశారు.ఉత్పత్తి కంటే భద్రతకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని,ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గనిలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ పర్యటనలో జీఎం(సేఫ్టీ) బీ.పీ.ఏ రీజియన్ కె.రఘుకుమార్ ,ఎస్.ఓటు జీఎం లలితేంద్ర ప్రసాద్,ప్రాజెక్ట్ అధికారి ఎం.మల్లయ్య, రక్షణ అధికారి ఎన్.పైడయ్య,ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎన్. వెంకటవంశీధర్,ఇన్‌చార్జ్ మేనేజర్ శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు..






వన్ హెల్త్ విధానాన్ని ప్రోత్సహించాలి..

-వైద్య నిపుణుల సూచన

**మేడ్చల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)**దఆరోగ్యం కోసం అందరు సైన్స్‌కు తోడుగా వైద్య రంగంలో మానవ,జంతు,పర్యావరణ ఆరోగ్య పరిరక్షణకు "వన్ హెల్త్" విధానాన్ని ప్రోత్సహించా లని వైద్య నిపుణులు సూచించారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఘనపూర్ మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో పలు కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాల లో భాగంగా రంగోళి,క్విజ్,డిజిటల్ పోస్టర్ల తయారీలో పోటీలు నిర్వహించారు.వీటితో పాటూ మిమ్స్ ఆవరణలోని ఆడిటోరియంలో నేటి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం యొక్క థీమ్ అయిన ఆరోగ్యం కోసం అందరం-సైన్స్‌కు తోడుగా పై విద్యార్థులు ప్రత్యేక ఉపన్యాసాలను ఇవ్వడం జరిగింది.ఈ ఉపన్యాసాలలో ప్రధానంగా కళాశాలకు చెందిన డా. అంకుష్ పవార్, అసిస్టెంట్ ప్రొఫెసర్,కమ్యూనిటీ మెడిసన్ వారు వైద్య రంగంలో శాస్త్రీయ ఆధారాలు, పరిశోధనలు, అంతర్జాతీయ సహకారం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుందని, మానవ,జంతు మరియు పర్యావరణ ఆరోగ్య పరిరక్షణకు"వన్ హెల్త్" విధానాన్ని ప్రోత్సహించడంపై చర్చించి పరిష్కార మార్గాలను సూచించారు.దీంతో పాటూ ప్రస్తుతం విస్తృతంగా అందుబాటులో ఉన్న డిజిటల్ మీడియా ద్వారా ఆరోగ్య సంబంధిత అంశాలను ఎలా విస్తృతంగా ప్రచారం చేయవచ్చనే అంశంపై కూడా డా.హేమలత ,అసిస్టెంట్ ప్రొఫెసర్, కమ్యూనిటి మెడిసన్ వారు ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డా.దేవేంద్ర సింగ్ నేగి



ప్రిన్సిపల్,డా.శైలేంద్ర,వైస్ ప్రిన్సిపల్,డా.కల్పన, ప్రొఫెసర్,విభాగాధిపతి ,గైనకాలజీ విభాగం,డా. లియోవాజ్,ప్రొఫెసర్ విభాగాధిపతి,కమ్యూనిటి మెడిసన్,డా.ఈనాక్షి, ప్రొఫెసర్,కమ్యూనిటి మెడిసిన్, డా.పవన్ కుమార్ శర్మ, ప్రొఫెసర్,కమ్యూనిటి మెడిసన్,డా.అంకుష్ పవార్,డా.హేమలత, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ,కమ్యూనిటీ మెడిసిన్ , పలువురు వైద్యవిద్యార్థులు ,నర్సింగ్,పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్ దాసరి పార్థసారధికి అత్యున్నత సేవ పురస్కారం అవార్డు అందజేసిన

రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహా



**ఉప్పల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** తెలంగాణ ప్రభుత్వ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా జేఎస్ పిఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల రామాంతపూర్ హైదరాబాద్ కు చెందిన డాక్టర్ దాసరి పార్థసారథికి రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత సేవ పురస్కారం అవార్డును రాష్ట్ర వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా తెలంగాణ ప్రభుత్వం రవీంద్ర భారతిలో జరిగిన ప్రపంచ ఆరోగ్యదినోత్సవ వేడుకలలో ప్రదానం చేశారు.కళాశాల మెడిసిన్ విభాగానికి అవార్డు రావడం ఆనందదాయకమని డాక్టర్.పార్థసారథిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.లింగరాజు అభినందించారు.

## శ్రీచైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు..




**మందమర్రి,ఏప్రిల్07(సూర్యరేఖ)** శ్రీచైతన్య స్కూల్‌లో 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు ప్రత్యేక గ్రాడ్యుయేషన్ గౌన్లు,క్యాప్స్ ధరించి ఆకట్టుకున్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ...5వ తరగతి పూర్తి చేసి ఉన్నత తరగతుల వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులకు ఇది ఒక మధురమైన మైలురాయి అని తెలిపారు.విద్యార్థులు భవిష్యత్తులో క్రమశిక్షణతో చదువులో రాణించి,తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు,నృత్యాలు,పాటలు ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు.విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు,జ్ఞాపికలు అందజేశారు.పిల్లల ఆనందం,తల్లిదండ్రుల గర్వభావం,ఉపాధ్యాయుల ఆశీర్వాదాలతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ వేడుకలో పాఠశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం..

ఆరోగ్యం ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యం..

నడక,వ్యాయామం,సమతుల్య ఆహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు..

ఎస్ఐ వీరభద్రరావు,కోటేశ్వరరావు

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మరిపెడలో భారీ ర్యాలీ..



**మరిపెడ,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** ఆరోగ్యమే మహాభాగ్యమని,ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని ఎస్ఐ వీరభద్రరావు, కోటేశ్వరరావు అన్నారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలో మంగళవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ వీరభద్రరావు,కోటేశ్వరరావు,ఆర్‌కే వాకర్స్ టీం సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించింది.ఈ సందర్భంగా ఎస్ఐ వీరభద్రరావు మాట్లాడుతూ...ఆరోగ్యం ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యమని,రోజువారీ నడక,వ్యాయామం,సమతుల్య ఆహారం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్యులను సంప్రదించాలని అన్నారు.ఆర్‌కే వాకర్స్ టీం సభ్యులు ఆరోగ్యకర జీవనశైలిపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు,యువత,వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు గ్రహీతలను సన్మానించిన ఎర్ర విజయరావ్



**మేడ్చల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకొని రవీంద్రభారతిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్,బాబు జగ్జీవన్ రామ్ ఉత్సవాల కమిటీ అందజేసిన"దళిత రత్న"అవార్డు గ్రహీతలు జీడిపల్లి శివకుమార్,జీడిపల్లి రామకృష్ణ,ఎర్ర బాలకృష్ణ,లకు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు,ఐఎన్ టియుసి మేడ్చల్ ఆటో యూనియన్ అధ్యక్షులు ఎర్ర విజయరావ్ సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి బాలనరసింహ,సింగనగూడం బిక్షపతి, నల్లవల్లి శ్రీనివాస్,శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## గుంపెల్లగూడెం గ్రామ అభివృద్ధికి కీలక అడుగు..

ఎంపీని కలిసిన సర్పంచ్ కృష్ణవేణి




**కారేపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** గుంపెల్లగూడెం గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణివీరబాబు,మంగళవారం ఎంపీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ప్రధాన సమస్యలు,అవసరాలు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు.గ్రామానికి అత్యవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు,రహదారులు, పారిశుధ్యం,విద్యా మరియు ఆరోగ్య రంగాల బలోపేతానికి తగిన నిధులు, సహకారం అందించాలని వినతిపత్రం సమర్పించారు.గ్రామ ప్రజల సంక్షేమం దృష్ట్యా వివిధ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని కూడా వివరించారు.అదేవిధంగా,సీఎం రిలీఫ్ ఫండ్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ సేవాభావాన్ని చాటుకున్నట్లు తెలిపారు.ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులుగా కృష్ణవేణి వీరబాబు సేవలను స్థానికులు అభినందిస్తున్నారు.గుంపెల్లగూడెం గ్రామ అభివృద్ధికి ఈ సమావేశం ఒక ముఖ్యమైన ముందడుగు కావాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి వాకర్స్ అసోసియేషన్ భారీ చేయూత..








**బెల్లంపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం హనుమాన్ బస్తీకి చెందిన నిరుపేద యువతి అనూష వివాహం మహేష్‌తో బుధవారం ఉదయం జరగనుంది. ఈ శుభ సందర్భంగా తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మానవత్వాన్ని చాటుతూ పేదింటి ఆడబిడ్డ పెళ్లికి పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందించారు.50 కిలోల బియ్యం,చిల్లర సామాను,కూరగాయలు అందించి వివాహ ఏర్పాట్లలో భాగస్వాములయ్యారు.అసోసియేషన్ సభ్యుల సహకారంతో ఈ వివాహం జరగడం స్థానికంగా అభినందనీయంగా మారింది.ఈ కార్యక్రమానికి సభ్యులందరూ ఆహ్వానితులని, సమయానికి విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించాలని అసోసియేషన్ అధ్యక్షుడు రంగ రామన్న,ప్రధాన కార్యదర్శి కంటెవాడ నాగేష్ కుమార్,33వ వార్డు కౌన్సిలర్ పోలు ఉమాదేవి శ్రీనివాస్ కోరారు.

## పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి..

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలి..

మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలన..







**మరిపెడ,ఏప్రిల్07(సూర్యరేఖ)** మరిపెడ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఆదేశించారు.మంగళవారం ఆమె మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ పరిధిలోని 5,10వ వార్డులలో కొనసాగుతున్న వంద రోజుల పారిశుధ్య పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ...పట్టణంలో పారిశుధ్య పనులు సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రతి వార్డులో చెత్తా చెదారంతో పాటు మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. పారిశుధ్యం సక్రమంగా అమలయితేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలు సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుగులోతు నీలా లచ్చిరాం,వార్డు ఆఫీసర్లు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జియాగూడ స్లాటర్ హౌస్ మూసివేయడం వల్ల వేలమంది ఉపాధి కోల్పోయారు,తెరిపించండి..

మిత్ర కృష్ణ



**నాంపల్లి,హైదరాబాద్,ఏప్రిల్07(సూర్యరేఖ)** జియాగూడ కమెలాలో స్లాటర్ హౌస్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం మూసివేసిన స్లాటర్ హౌస్ తిరిగి తెరిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ప్రముఖ సంఘ సేవకులు,ఉమ్మడి రాష్ట్ర ఎస్సి సేల్ మాజీ చైర్మన్,మిత్ర అసోసియేట్ ఛైర్మెన్ ఆయిందాల కృష్ణ (మిత్ర కృష్ణ),అరే కటిక సంఘం సభ్యులు,కటిక మొండేదార్ కమిటీ సభ్యులతో కలసి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలసి స్లాటర్ హౌస్ కార్మికుల సమస్యలు వివరిస్తూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మిత్ర కృష్ణ మాట్లాడుతూ..జియాగూడ కమెలా ప్రాంతంలోని స్లాటర్ హౌస్ ను మూసివేయడం వల్ల రోజువారీ కూలీలు,చిన్న వ్యాపారులు,వ్యాపారస్తులు, దీనిపై ఆధారపడిన అనేక పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు.ఈ మార్కెట్పై ఆధారపడి జీవనం సాగిస్తున్న రోజువారీ కూలీలు,చిన్న చిన్న వ్యాపారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని,స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు.ప్రభుత్వం చొరవ చూపి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని,అప్పటి వరకు మూసిన కామేలను తెరిపించాలని కోరడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కటిక మొండేదార్ కమిటీ సభ్యులు టి.నర్సింగ్ రావు,వినోద్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## కార్మికుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం..

ఆరోగ్య అధికారి డాక్టర్ పి.లోక్నాథ్ రెడ్డి



**మందమర్రి,ఏప్రిల్07(సూర్యరేఖ)** ఉద్యోగులు,కార్మికుల ఆరోగ్య సంరక్షణకే సింగరేణి సంస్థ ప్రధాన ప్రాధాన్యత ఇస్తోందని ఆరోగ్య అధికారి డాక్టర్ పి.లోక్నాథ్ రెడ్డి తెలిపారు.ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ,డివై సీఎమ్ఓ మధుకుమార్ మార్గదర్శకత్వంలో మంగళవారం మందమర్రి ఏరియాలోని కెకె-5 గనిపై ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ లోక్నాథ్ రెడ్డి మాట్లాడుతూ...ఎండ తీవ్రత కారణంగా కలిగే వడదెబ్బ లక్షణాలను వివరించారు. వడదెబ్బకు గురైనప్పుడు తీసుకోవాల్సిన తక్షణ ప్రథమ చికిత్సపై కార్మికులకు అవగాహన కల్పించారు.ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తరచుగా మంచినీరు,ఓఆర్ఎస్ ద్రావణం,మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు.అలాగే మద్యపానం,ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.గని మేనేజర్ శంభూనాథ్ పాండే, రక్షణ అధికారి చీకటి రమేశ్ మాట్లాడుతూ...కార్మికులు అధికారుల సూచనలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనలో ఆరోగ్యం కీలకమని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గని సీనియర్ పర్సనల్ అధికారి ఏ. రవళి,యూనియన్ నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన హెచ్.ఎం.టినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పాలక మండలి సభ్యులు..



**ఉప్పల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** హెచ్ఎంటినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పాలకమండలి సభ్యులు మంగళవారం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త కమిటీ సభ్యులందరికీ శాలువాలతో సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు.రూ.30 కోట్లతో హెచ్ఎంటి నగర్ చెరువు సుందరీకరణకు ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు,అలాగే సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.1.10 కోట్లు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యేకి వెల్ఫేర్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.బుచ్చయ్య, ఉపాధ్యక్షుడు ఆర్. యాదగిరిరెడ్డి,ప్రధాన కార్యదర్శి జి.రామ కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కె.శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.సమ్రాట్,ఖజాంచి జి. రామరావు,కార్యవర్గ సభ్యులు వి.బాల్ రెడ్డి,పి. నరసింహారెడ్డి,బి.హెచ్.నారాయణబాబు,ఎండీ. యూసుఫ్,సతీష్ కులకర్ణిలతోపాటు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముత్యం ప్రవీణ్ కుమార్ మృతి తీరని లోటు..

కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు..



**కొల్చారం,ఏప్రిల్07(సూర్యరేఖ)** మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు ముత్యం ప్రవీణ్ కుమార్ గత కొన్ని రోజుల క్రితం నుండి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఆయన కొంతకాలంగా మెదక్ మార్కెట్ చైర్మన్ గా పనిచేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డికి అత్యంత సన్నితుడు ముత్యం ప్రవీణ్ కుమార్,సునీత లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు,ముత్యం ప్రవీణ్ కుమార్ కూడా కాంగ్రెస్ పార్టీ కొనసాగాడు. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరగానే సునీత లక్ష్మారెడ్డితో పాటు ముత్యం ప్రవీణ్ కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరాడు.ముత్యం ప్రవీణ్ కుమార్ మరణించిన సంగతి తెలియగానే కొల్చారం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆశ్చర్యానికి గురయ్యారు.

## పేద ఆడబిడ్డకు విశ్వబ్రాహ్మణుల ఆర్థిక సహాయం..



**బెల్లంపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** స్థానికంగా విశ్వబ్రాహ్మణ సభ్యులు పేద ఆడబిడ్డకు చేయూతనిస్తూ మానవతను చాటుకున్నారు.జన్నం సత్యనారాయణ,శ్రీరామోజు లక్ష్మణ్,సిరికొండ ప్రసాద్,గన్నవరం తిరుమలచారి,దేవరకొండ చంద్రశేఖర్,రాజన్న తదితరులు కలిసి రూ.6500 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పోలు ఉమాదేవి శ్రీనివాస్ పాల్గొని సభ్యుల సేవాభావాన్ని అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా పెరగాలని ఆకాంక్షించారు.

## కట్ట మైసమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రామన్నగారి రాఘవేంద్రగౌడ్



**మేడ్చల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మేడ్చల్ డివిజన్ పరిధిలోని కట్టమైసమ్మ ఆలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేంద్రగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు శాలువతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.అనంతరం రాఘవేంద్రగౌడ్ మాట్లాడుతూ...బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.అమ్మవారి కృప కటాక్షాల చేత ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు సకారిబోనియా వెంకటేశం,శ్రీను, నర్సింగ్ రావు,నడికొప్పు దర్శన్, రాములమ్మ,తదితరులు పాల్గొన్నారు.

సూర్య



# మహిళ సంఘాల ఋణాలలో అక్రమాల నిగ్గు తేల్చాలి..

## విచారణ పేరుతో కాలయాపన సరికాదు..

## అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి..

## డ్వాక్రా మహిళల సమస్యలపై ఐద్వా సర్వే..



**కారేపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** సింగరేణి మండలం విజేత మండల మహిళా సమాఖ్య పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇచ్చిన ఋణాలలో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు రమణ,బండి పద్మ,మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతిలు డిమాండ్ చేశారు. గ్రామాల్లో డ్వాక్రా మహిళల సమస్యలపై ఐద్వా మంగళవారం సర్వే నిర్వహించింది.డ్వాక్రా గ్రూపులో సభ్యులుగా ఉన్న మహిళలకు తెలియకుండానే స్త్రీనిధి,లింకేజీ రుణాలు రూ.లక్షలను విజేత మండల సమాఖ్యలోని వివిధ స్థాయి సిబ్బంది కాజేశారని సర్వేలో బాధిత మహిళలు తెల్పినట్లు ఐద్వా నేతలు తెలిపారు. మొట్లగూడెంలో వినాయక్,స్వరాజ్ గ్రూపులతో పాటు ఇతర గ్రామాలలోని గ్రూపులో గ్రామంతో సంబంధం లేనివారి పేర్లను చేర్పించి,గ్రామ దీపిక(బుక్ కీపర్),వెలుగు సీసీ,సిబ్బంది,ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ లక్షల రూపాయల అవినీతి పాల్పడ్డట్టు తమ సర్వేలో మహిళలు తెలిపారన్నారు.ఋణాలతో సంబంధం లేని ఉన్నాయని వాటిని చెల్లించాలని బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేసి వారిని ఒత్తిడికి గురి చేస్తున్నారని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అక్రమాలపై ఉన్నత అధికారులు విచారణ పేరుతో ఆఫీస్ చుట్టూ తిప్పుకోవడం తప్ప సమస్య పరిష్కారం కావటం లేదని వారు ఆరోపించారు. సింగరేణి మండలంలో మహిళ స్వయం సహాయక సంఘాల రుణాలలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవటంలో జాప్యం జరుగుతుందని ఇది సహించరానిదని ఐద్వా నేతలు అన్నారు.తప్పుడు గ్రూపును తయారు చేయడం,గ్రామానికి సంబంధం లేని సభ్యులను గ్రూపులో ఉంచటం,గ్రామ సమాఖ్య సభ్యులకు తెలియకుండా తీర్మానాలను చేయడం లాంటి అక్రమచర్యలు స్పష్టంగా కనపడుతున్నా విచారణ, రికవరీలు పేరుతో అక్రమార్కులపై చర్యలకు కాలయాపన చేయడం సరికాదన్నారు. జిల్లా పిడి,ఇతర జిల్లా అధికారులు వెంటనే స్పందించి అక్రమాలను అరికట్టాలన్నారు.ఐద్వా చేపట్టిన సర్వేలో మండల వ్యాప్తంగా వెలుగులోకి వచ్చిన అంశాలపై బాధిత మహిళలను సమీకరించి ఆందోళన చేస్తామని ఐద్వా నేతలు హెచ్చరించారు

## ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ ఆలయంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్--మూడో రోజు విజయవంతం..




**కారేపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)**దసింగరేణి మండలం ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో వైరా--ఇల్లందు నియోజకవర్గ స్థాయిటెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా కొనసాగుతోంది.పర్స పట్టాభి రామారావు ఆశీస్సులతో,శ్రీగణేష్ అడ్వాన్స్ డెంటల్ కేర్ ఆసుపత్రి యజమాని డాక్టర్ బాలసాని వినయ్ గౌడ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ విజయవంతంగా మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ బాలసాని వినయ్ గౌడ్ మాట్లాడుతూ...ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీయడానికి,గ్రామ స్థాయిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ఇటువంటి పోటీలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.క్రీడల ద్వారా సమయపాలన,జట్టు సమన్వయం,క్రమశిక్షణ,కలిసికట్టుగా పని చేసి విజయాన్ని సాధించే నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.యువత క్రీడలతో పాటు విద్య మరియు సామాజిక బాధ్యతలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లలిత కళామందిర్ ప్రొప్రైటర్ సుదర్శన్ గౌడ్,సర్పంచులు, ఉపసర్పంచులు,గ్రామ పెద్దలు,జట్టు సభ్యులు, క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 500మందికి ఉచిత అంబలి సేవలో ముందున్న వాకర్స్ అసోసియేషన్డపోలు శ్రీనివాస్



**బెల్లంపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా మార్కెట్ ప్రాంతంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, నిరుపేదలు,కూలీలు,ఆటో డ్రైవర్లు,బాటసారులు, చిరు వ్యాపారస్తులకు కలిపి సుమారు 500మందికి ఉచితంగా అంబలి పంపిణీ చేశారు.దాతలుగా ముత్తే వెంకట్రాజం,పోలు శ్రీనివాస్ కౌన్సిలర్ సహకారంతో 12వ రోజు అంబలి పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.ప్రతిరోజు మధ్యాహ్నం12 గంటలకు అంబలి పంపిణీ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ సేవా కార్యక్రమానికి ముందుకొచ్చిన దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కంటెవాడ నాగేష్ కుమార్,కజ్జం రమేష్,గెల్లీ జయరాం యాదవ్, నాగుల లింగయ్య,రత్నం ఐలయ్య,హరిదాస్,ఎం. సారయ్య,తిప్ప శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## అంటూ వ్యాధులపై డి.ఎం.హెచ్.ఓ అవగాహన..

**ధర్మారంలో ఆరోగ్య శిబిర సందర్శన..**

**పిహెచ్ సిలో రిజిస్టర్ తనిఖీ.**



**రామాయంపేట,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** రామాయంపేట మండలం డిధర్మారంలో మంగళవారం జరిగిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ సందర్శించారు.ఈ శిబిరంలో 84మంది రోగులకు ప్రత్యేక వైద్యుడు చేరుకొని పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా పరిశీలించిన శ్రీరామ్ రోగులతో మాట్లాడుతూ... అంటూ వ్యాధులపై అజాగ్రత్త చేయరాదన్నారు. ఏదేని ఆరోగ్య సమస్యలు ఉంటే ఆసుపత్రి వైద్యులకు తెలుపాలన్నారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగుల వైద్య పరీక్షల రికార్డును పరిశీలించడం జరిగింది.ఆయన వెంట మండల వైద్యాధికారిణి,వైద్య సిబ్బంది పాకాల వెంకటేశ్వరరావుతో పాటు ఏఎన్ఎం,ఎంఓ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రేషన్ షాప్ లో ఆకస్మిక తనిఖీ..



**శివంపేట,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** శివంపేట మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో రేషన్ బియ్యం అకస్మాత్తుగా తనిఖీలు చేయడం జరిగింది. తూకం వేసే యంత్రాన్ని మరియు ఫింగర్ ప్రింట్ తీసే మిషన్ ప్రజలకు న్యాయంగా రేషన్ బియ్యం వస్తున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సర్పంచ్ పెంజర్ల మమత-నర్సింలు మాట్లాడుతూ...మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇవ్వడం జరుగుతుందని,ఎవరు కూడా నిర్లక్ష్యం చేయకుండా రేషన్ బియ్యాన్ని అందరూ తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.గ్రామంలోని రేషన్ షాపులో ఎలాంటి అవకతవకలు లేకుండా బియ్యం పంపిణీ జరుగుతుందని అధికారులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గిరిదవారి అనిత,జిపిఓ నరేష్,గ్రామ సర్పంచ్ పెంజర్ల మమత-నర్సింలు, నాలుగోవ వార్డు మెంబర్ మస్కూరి సంతోష,పరశురాం,గ్రామ సెక్రెటరీ సంతోష్ కుమార్, మస్కూరి కుమార్,బోలా పాపయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 15వ వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలి..

**మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందించిన 15వ వార్డు కౌన్సిలర్**



**బెల్లంపల్లి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని 15వ వార్డులో సమగ్ర అభివృద్ధి కోసం తక్షణమే నిధులు కేటాయించాలని వార్డు కౌన్సిలర్ వసంత కోరారు.ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.వార్డులో ప్రాథమిక వసతుల కొరతను ప్రస్తావిస్తూ నూతన ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు,సీసీ రోడ్ల నిర్మాణం,డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.అలాగే అమృత్ 2.0 పథకం కింద ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటి కనెక్షన్లు కల్పించాలని కోరారు.వినతిపై స్పందించిన కమిషనర్ సంపత్ రెడ్డి,15వ వార్డు అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తానని హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ వసంత తెలిపారు.

## పుస్తె మెట్టెలకు ఆర్థిక సహాయం..

**తాజా మాజీ పిఏసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి**



**శివంపేట, ఏప్రిల్ 07(సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన చాకలి రమేష్-మల్లిక వివాహానికి పుస్తె మట్టెలకు రూ.10వేలు శివంపేట మండల తాజా మాజీ పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి ఆర్థిక సహాయాన్ని గుండ్లపల్లి సర్పంచ్ పెంజర్ల మమత-నర్సింలు యాదవ్ చేతుల మీదుగా వారికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యనారాయణ ముదిరాజ్,వార్డ్ మెంబర్స్ సదానందం ముదిరాజ్,మస్కూరి పరుశురాం ముదిరాజ్,ఉప్పునూతల సత్యనారాయణగౌడ్, దత్తాత్రేయగౌడ్,బజారి శ్రీనివాస్ రెడ్డి,ఎలుకంటి వినోద్,కుమార్,బోళ్ల మహేష్,గడ్డం శంకర్,ఎల్క ప్రభాకర్ రెడ్డి,ఉప్పునూతల శివగౌడ్,ఎండి ఖాదర్ బాషా,బజారి కృష్ణారెడ్డి,బోల సిద్దు,ఎలుకంటి వెంకటేష్,సట్టి విట్టల్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పద్మావతికాలనీలో విద్యుత్ శాఖ అధికారుల బస్తీబాట..

**విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే బస్సుబాట కార్యక్రమం..**

**హబ్సిగూడ ఎస్.ఈ.వెంకన్న**



**ఉప్పల్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ప్రజాబాట"కార్యక్రమం ద్వారా విద్యుత్ శాఖ ప్రజలకు మరింత చేరువవుతోంది.బస్తీబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం హబ్సిగూడ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకన్న,డివిజనల్ ఇంజనీర్ సుబ్బారావు, ఉప్పల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రవీందర్, చిల్కానగర్ అసిస్టెంట్ ఇంజనీర్ వినయ్ కుమార్ రెడ్డి,లు పద్మావతి కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా అధికారులు కాలనీ వాసులతో నేరుగా ముచ్చటించి,వారి విద్యుత్ సంబంధిత సమస్యలను తెలుసుకుని,వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.విద్యుత్ సరఫరా,నిర్వహణపై కాలనీ వాసులు సంతృప్తి వ్యక్తం చేస్తూ,శాఖ అధికారులు నిరంతరం అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రజలకు నిరంతర,నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో విద్యుత్ శాఖ చేస్తున్న కృషి ప్రశంసనీయమని కాలనీ వాసులు అభిప్రాయపడ్డారు.ప్రజాబాట కార్యక్రమాలు ప్రజలతో శాఖ మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి,కాలనీ సలహాదారు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడకు మన్నన తెచ్చిన గంట్ల అనిల్ రెడ్డి..

## రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న డ్రగ్స్ ఇన్స్పెక్టర్..
## గంట్ల అనిల్ రెడ్డికి పలువురి అభినందనలు

**మరిపెడ,ఏప్రిల్07(సూర్యరేఖ)** ప్రజారోగ్య రంగంలో విశిష్ట సేవలందించి మరిపెడకు మన్నన తెచ్చిన డ్రగ్స్ ఇన్స్పెక్టర్ గంట్ల అనిల్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో గౌరవాన్ని అందుకున్నారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసే ఉత్తమ సేవ పురస్కారంను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీకి చెందిన గంట్ల అనిల్ రెడ్డి డ్రగ్స్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఔషధ నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు నాణ్యత ప్రమాణాల అమలులో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.ఫార్మసీ తనిఖీలు,నకిలీ మందుల నియంత్రణ,ప్రజల్లో సరైన ఔషధ వినియోగంపై అవగాహన కల్పించడం వంటి అంశాల్లో ఆయన






చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో ఏర్పడిన అత్యవసర పరిస్థితుల్లో మరిపెడ ప్రాంతంలో వ్యాప్తి నియంత్రణకు ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమైనవి..లక్షలాది రూపాయల విలువైన ఔషధాలు,మస్క్ లు,శానిటైజర్లు పంపిణీ చేసి ప్రజలకు అండగా నిలిచారు.ఆ క్లిష్ట సమయంలో ఆయన చూపిన సేవా భావం స్థానికుల మన్ననలు పొందింది.అనిల్ రెడ్డికి రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించడం మరిపెడ ప్రాంతానికి గర్వకారణమని స్థానిక ప్రజాప్రతినిధులు, సహచరులు ,స్నేహితులు పేర్కొన్నారు.ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని ,ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇంకా కృషి చేస్తానని అనిల్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న ఈ సందర్భం గా గంట్ల అనిల్ రెడ్డిని మరిపెడ ప్రాంత ప్రజలు, కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు, శ్రేయోభిలాషులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ నాణ్యమైన విద్య బోధన అందించాలి





జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మందమర్రి,ఏప్రిల్07(సూర్యరేఖ)**ప్రభుత్వ పాఠశాలలు,సంక్షేమ వసతి గృహాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని,విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి అదనపు తరగతి గదులు,భోజనశాల నిర్మాణ పనుల నాణ్యత, తరగతి గదులు,పారిశుద్ధ్య నిర్వహణ, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని,వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధన దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వంటశాల, సామాగ్రి నిల్వగదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని,ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు.అనంతరం తెలంగాణ ఆదర్శ పాఠశాల,జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య,విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. అధికారులు ,సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదా రితనంగా వ్యవహరించాలని ,రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, వివిధ ధ్రువపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి విధులకు హాజరు కాని 6మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహసిల్దార్ ను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూసంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని,వివిధ ధ్రువపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద తాళ్లకుంటలో ఆరోగ్య దినోత్సవం.





ఆరోగ్యమే మహాభాగ్యం..
ఆరోగ్య ప్రతిజ్ఞ చేసిన వాకార్స్

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హైదర్ గూడ డివిజన్ పరిధిలోని పెద్ద తాళ్లకుంటలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.స్పార్క్ వాకతాన్,తో పాటు యోగ,ఉచిత ఆరోగ్య పరీక్షలు,అవగాహన శిబిరం నిర్వహించారు.అహం సూత్ర మీడియా ల్యాబ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు,మహిళలు వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్యమే మహాభాగ్యం..భోగం రోగం..యోగ ఆరోగ్య యోగం అంటూ ప్రతిజ్ఞ చేశారు.ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రాణి కొప్పుల మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ కమిటీ ప్రతినిది రాధాకాంత్ దాస్,పెద్ద తాళ్లకుంట వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జంగయ్య,దుర్గా దాస్,హరినాథ్ సహదేవరెడ్డి,లక్ష్మారెడ్డి,కొంగల శ్రీనివాస్,అహం సూత్ర ప్రతినిధి అజిత్,సీనియర్ జర్నలిస్టు,సామాజిక కార్యకర్త మేడం మధుసూదన్, నాయకులు కొమురయ్య, జయానంద్ రెడ్డి,నల్లింగ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవతరగతి పరీక్షలు..

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి..
రోగులకు సరైన వైద్యం అందాలి..
భూభారతి,ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉండొద్దు..
జిల్లా అదనపు కలెక్టర్ నగేష్





**రామాయంపేట,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ రామాయంపేట మండలంలో,నిజాంపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు.రామాయంపేట ప్రభుత్వ పాఠశాలలో, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను పరిశీలించారు.పరీక్షలు ప్రశాంతంగా జరగాలని, విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.రామాయంపేట ఎంఎల్ఎస్ పాయింట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలన్నారు. స్టాక్ వివరాలను అడిగితెలుసుకున్నారు.నిజాంపేట్ పిహెచ్సినీ పరిశీలించి రోగులకు మంచి వైద్యం అందాలన్నారు. రోగులకు ఉచితంగా పరీక్షలు అందించాలని వైద్యులకు సూచనలు అందించారు.నిజాంపేట తహసిల్దార్ కార్యాలయన్నీ తనిఖీ చేశారు భూభారతి దరఖాస్తులను,ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉండొద్దు అన్నారు.భూసర్వే,ఇసుక సమస్యలను అడిగితెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం..



**మనోహరాబాద్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మనోహరాబాద్ మండలంలోని పోతారం గ్రామంలో పల్లె దవాఖానలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సర్పంచ్ పుట్ట వినోద-మహేందర్ మాట్లాడుతూ ..."ఆరోగ్యమే మహాభాగ్యం"అన్న నినాదాన్ని నిజం చేయాలంటే ప్రతి ఒక్కరు తగిన వ్యాయామం,పోషకాహారం తీసుకోవాలని,ప్రస్తుతం పెరుగుతున్న కల్తీ వ్యాపారంతో ప్రజలు జాగ్రత్తగా ఉండి పోషక పదార్థాలు కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుట్ట-వినోద మహేందర్,సబ్ సెంటర్ డాక్టర్ శ్యామల,సెక్రటరీ రజిత,ఏఎన్ఎం జనాభాయ్,ఆశ వర్కర్ రత్న,గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ..



**శివంపేట్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి,మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట మండలశీలోని గూడూరు గ్రామంలో బోయిని కొమరమ్మ రూ.46,500,నర్సాపూర్ నియోజకవర్గం ఆవంచ గ్రామానికి చెందిన మహమ్మద్ బద్దర్ రూ 14వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన సీఎంఆర్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా చిలుముల సుహాసిని రెడ్డి,బండారి గంగాధర్,లు మాట్లాడుతూ... అనారోగ్యం,ప్రమాదాలు తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,ప్రభుత్వం వైద్య చికిత్సల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయలేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి,కాంగ్రెస్ నాయకులు రాధాకృష్ణ,శ్రీశైలం యాదవ్,దడిగ నరేష్,కొండి దుర్గేష్,శ్రీనివాస్ రెడ్డి,శంకర్ గౌడ్,చందు,చిన్న యాదవ్,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి..

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,ఏప్రిల్ 07,(సూర్యరేఖ)**వరి ధాన్యం కొనుగోలుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి,జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ,జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్,జిల్లా రవాణా అధికారి సంతోష్,కార్మిక శాఖ అధికారితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిర్ణీత మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.ధాన్యం క్వింటాలు గ్రేడ్--ఏ రకానికి 2 వేల 389 రూపాయలు,సాధారణ రకానికి 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించిందని,సన్న రకం వడ్లకు క్వింటాలుకు 500రూపాయల బోనస్ అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొంత ఎత్తైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని,కొనుగోలు కేంద్రాలలో గోనె సంచులు భద్ర పరుచుటకు సరిపడా ఏర్పాట్లు చేయాలని,నిబంధనల ప్రకారం రైతులకు గోనె సంచులు ఇవ్వాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, నీడ,మూత్రశాలలు, విద్యుత్, టేబుల్, కుర్చీలు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు ఏర్పాటు చేయాలని,ప్రతి కొనుగోలు కేంద్రములో ఖచ్చితముగా 2ఎలక్ట్రానిక్ తూకం పరికరాలు,30 టార్పాలిన్లు,1ప్యాడి క్లీనర్ అందుబాటులో ఉంచాలని,ఒకవేళ ప్యాడి క్లీనర్





లేనిచో ట్రాక్టర్ మౌంటెడ్ ఫ్యాన్ ను ఏర్పాటు చేయాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతుల వద్ద నుండి వరుస ప్రకారం కొనుగోలు చేయాలని,రిజిస్టర్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని తెలిపారు.రైతులు ధాన్యం తీసుకొని వచ్చినపుడు తేమ శాతం 17శాతం కంటే ఎక్కువ ఉంటే,ధాన్యం ఆరబెట్టుకొని తేమ శాతం తగ్గిన తర్వాతనే ధాన్యం తీసుకొని రావాలని రైతులకు అవగాహన కల్పించాలని ,రైతులు ధాన్యం తీసుకొని వచ్చినపుడు వారి ఆధార్ కార్డ్,బ్యాంక్ పాస్ పుస్తకం, పట్టాదారు పాస్ పుస్తకం నకలు ప్రతులను తీసుకోవాలని, వ్యవసాయ విస్తరణ అధికారి జారీ చేసిన టోకెన్ తో ఓపిఎంఎస్ లో వివరాలు సరి చూసుకోవాలని,కౌలు రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా “కౌలు రైతు ధ్రువీకరణ పత్రం”ఖచ్చితముగా సమర్పించాలని తెలిపారు. ప్రతి సన్న రకం ధాన్యం సంచిపై ఎస్ అక్షరం,సెంటర్ కోడ్ ఎరుపు రంగుతో ఖచ్చితముగా వ్రాసిన తర్వాతనే ధాన్యం నింపాలని,బస్తాలను ఎరుపు రంగు దారంతో కుట్టాలని,దొడ్డు రకం ధాన్యం బస్తాలను ఆకుపచ్చ రంగు దారంతో కుట్టాలని,ఈ సంచులపై ఎటువంటి అక్షరాలు వ్రాయకూడదని తెలిపారు.ధాన్యం రవాణా చేసేటప్పుడు సన్న రకం,దొడ్డు రకం ధాన్యంను వేరు వేరులారీలలో తరలించాలని తెలిపారు.తూకం జరిపే సమయములో తేమ శాతం17 మించకుండ ఉండేలా చూసుకోవాలని,పొల్లు,రాళ్ళు మట్టి పెడ్డలు లేకుండా నాణ్యత ప్రమాణాలకి లోబడి ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు.ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత పూర్తి భాద్యత కొనుగోలు నిర్వాహకులదేనని,కొనుగోలు జరిపిన వెంటనే సంబశీదిత రైతుకు కొనుగోలు పత్రం తూకం వివరాలతో ఇవ్వాలని తెలిపారు.జిల్లాలో కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలని,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు కొనుగోలు రిజిస్టర్ లో నమోదు చేసి ట్యాబ్ నందు వివరాలు నమోదు చేయాలని,ట్రక్ చిట్ లో వ్రాసిన రైతుల ప్రకారమే మిల్లులకు ధాన్యం సరఫరాలో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ట్యాబ్ లో నమోదు చేసిన తరువాత రైతులకుచెల్లింపులు చేయుట కొరకు రైస్ మిల్ ట్రక్ చిట్ రసీదు కాపీ,రైతు కొనుగోలు పత్రం జిల్లా మేనేజర్,పౌర సరఫరా సంస్థ కార్యాలయంలో అందించాలని తెలిపారు.కొనుగోలు సమయంలో ఇతర కేంద్రాల నుండి తీసుకొన్న/పంపిన గోనె సంచుల వివరాలు జాగ్రతగా నమోదు చేసుకొని,ఆ వివరాలను రికాన్సిలేషన్ సమయములో సమర్పించాలని,ప్రతి రోజు కొనుగోలు కేంద్రాల వారీగా ధాన్యం కొనుగోలు సమాచారం,రైస్ మిల్లుకు పంపిన ధాన్యం వివరాలు అందించాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే స్వర్ణయుగం సాధ్యం..







ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో వచ్చేది భాజపా ప్రభుత్వమే..

బిజెపి చీఫ్ రామచంద్రరావు



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** దేశ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు అన్నారు.సోమవారం రాత్రి హైదర్ గూడ డివిజన్లోని ఉప్పర్ పల్లి లో బిజెపి సీనియర్ నాయకుడు బొక్క బాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున యువకులు రామచంద్రరావు సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు .అంతకుముందు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉప్పర్ పల్లి పార్టీ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి,రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు రాజు భూపాల్ గౌడ్,లతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందం ్రావు పార్టీ జెండాను ఆవిష్కరించి,కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.పార్టీ సిద్ధాంతాలను ప్రతి కార్యకర్త నాయకులు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని రామచందర్‌రావు సూచించారు.దేశ ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని ఆయన కొనియాడారు.రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ స్వతహాగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజకీయ మార్పు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ వేదికపై వేగంగా అభివృద్ధి చెందుతోందని, దేశాన్ని వికసిత భారత్‌గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.విశ్వగురువుగా భారత్ నిలవాలన్నదే పార్టీ అంతిమ లక్ష్యం అన్నారు. దేశం ముందు,తర్వాత పార్టీ,చివర్లో మనం. ఈ నినాదమే పార్టీకి ఊపిరి. కశ్మీర్ ఉద్యమంలో ఆర్టికల్ 370 రద్దు కోసం జరిగిన పోరాటంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదానం మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు 50 వేల మంది జైలుకెళ్లారని ఆనాటి పోరాటమే నేడు దేశంలో ప్రజాస్వామ్యం సజీవంగా ఉండడానికి కారణమని వెల్లడించారు.2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ప్రతి కార్యకర్తా శ్రమించాలన్నారు .రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో యువత కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు.నాయకులు యువశక్తిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎవరెన్ని కుట్రలు చేసిన మూడు కార్పొరేషన్లలో ఒంటరిగా పోటీ చేసి కాషాయ జెండా ఎగరవేస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.పార్టీలో చేరిన వారిలో పలుగు చెరువు నరేందర్, రాకేష్ రవీందర్ కిరణ్ రాజ్ కుమార్ మధు మహేష్ రాజేష్ తరుణ్ మనోజ్ సాయి,రాము లక్ష్మణ్ సిద్దు విజయ్ చంద్రకాంత్ లు ఉన్నారు.

## అనుమతులు లేని నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు..

అనుమతి లేకుండా నిర్మిస్తే చర్యలే..

అనుమతులు లేని భవనాలనే కూల్చేస్తున్నాం..



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణంపై అధికారులు కొరడా ఝులిపించారు.బుద్వేల్ టీచర్స్ కాలనీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. టీచర్స్ కాలనీ ప్రధాన రహదారి పక్కనే పాత భవనం పైనే అనుమతులు లేకుండా మరో రెండు స్లాబ్ లు వేసాడు.అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణానికి అధికారులు రెండు షోకాస్ నోటీసులు జారీ చేసినప్పటికీ ఇంటి యజమాని అవేమీ పట్టించుకోలేదు.దీంతో మంగళవారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది అనుమతులు లేని నిర్మాణాన్ని కూల్చివేశారు.నిబంధనలకు విరుద్ధంగా ఎవరు కూడా అక్రమ నిర్మాణాలు నిర్మించొద్దని అధికారులు తెలిపారు.అనుమతులు ఒకలా నిర్మాణాలు మరల చేపడితే కూల్చి వేయడం తప్పదని హెచ్చరించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు ం అందించడమే లక్ష్యం..

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి..

మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి



**మరిపెడ,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అన్నారు.మంగళవారం ఆమె మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ప్రగతి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ కృషితో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు.అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చి అభివృద్ధి ఫలాలను అందజేయడమే లక్ష్యమని తెలిపారు.అర్హులందరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, వార్డు కౌన్సిలర్ జాటోత్ సురేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు గంధసిరి భిక్షపతి,అలువాల ఉపేందర్ ప్రజాపతి,బానోత్ చీనా,గుగులోత్ లచ్చిరాం తదితరులు ఉన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్



**రాజేంద్రనగర్,ఏప్రిల్07(సూర్యరేఖ)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని కళాశాల అసోసియేట్ డీన్ మంతని గోవర్ధన్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు.ఏసిబి డీఎస్పీ గంగసని శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం...బాధితుడు విత్తన కంపెనీ లైసెన్స్ కొరకు 2025 మార్చిలో దరఖాస్తు చేసుకున్నాడు.అప్పటినుంచి లైసెన్స్ ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో బాధితుడు అసోసియేట్ డీన్ ను ఆశ్రయించాడు.విత్తన కార్పొరేషన్ లో తనకున్న పరిచయాలతో విత్తన కంపెనీకి లైసెన్స్ ఇప్పించేందుకు లక్ష ఇరవై ఐదు వేల రూపాయలు లంచం డిమాండ్ చేసాడు.బాధితుడు ముందుగా 25 వేల రూపాయలు గోవర్ధన్ అసిస్టెంట్ కు యూపీఐ ట్రాన్స్ఫర్ చేశాడు.అమౌంట్ ట్రాన్స్ఫర్ చేయగానే ఫైల్ మూవ్ చేశారు.మిగతా లక్ష రూపాయల కోసం గోవర్ధన్ పదేపదే బాధితున్ని అడుగుతున్నాడు. దీంతో బాధితుడు ఏసీబీ సిటీ రేంజ్ యూనిట్ 2 అధికారులను ఆశ్రయించాడు.బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు.గోవర్ధన్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.ఎల్బీనగర్ లోని గోవర్ధన్ ఇంట్లో సోదాలు కొనసాగుతున్నాయి.

# పోరాటాల పార్టీకి ప్రజల అండ..

**బూర్జివ పార్టీలకు ధనవంతులు అండ..**
**ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ**







**రాజేంద్రనగర్,ఏప్రిల్07(సూర్యరేఖ)**పోరాటాల పార్టీకి ప్రజలు అండగా ఉన్నారు..మోసాలు చేసే బూర్జువా పార్టీలకు ధనవంతులు అండగా ఉన్నారని ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ అన్నారు.మంగళవారం సిపిఐ శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ మండల కేంద్రంలో బెంగళూరు హైవే పై ఉన్న హోటల్ షాపులలో ప్రజలను కలిసి పార్టీ కరపత్రాలను పంచుతూ ప్రజలతో ముచ్చటించారు.ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దేశంలో బూర్చివ పార్టీలైన బిజెపి,కాంగ్రెస్,తెలుగు రాష్ట్రాలలో ఉన్న తెలుగుదేశం,టిఆర్ఎస్ పార్టీలకు ధనవంతులు విరాళాలు ఇచ్చి వారికి సంబంధించిన నిర్ణయాలను అసెంబ్లీ పార్లమెంటులలో రూపొందించుకుంటారని,పోరాడే కమ్యూనిస్టు పార్టీ ప్రజలతో విరాళాలు సేకరించి ఆ ప్రజల సమస్యలపై పోరాటం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు.భారత నేలపై సిపిఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అవుతుందని,అధికారంలో లేకపోయినా ప్రజల పక్షాన కార్మిక వర్గం పక్షాన నికార్సుగా నిలబడి పోరాడే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా,ఇజ్రాయిల్,ఇరాన్ పై చేస్తున్న యుద్ధం వల్ల పెట్రోల్,డీజిల్ వంట గ్యాస్ సమస్యలు ఏర్పడతాయని,దానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని చెప్పడం దుర్మార్గమని ఆయన విమర్శించారు.విశ్వ గురువు అని చెప్పుకునే నరేంద్రమోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏమి చెపితే అది వినే పరిస్థితి ఏర్పడిందని,గతంలో ఏ ప్రధాని కూడా అమెరికాకు దాసోహం కాలేదు,ట్రంప్ కు భయపడి లొంగిపోయిన నరేంద్ర మోడీ దేశ పరువు తీశాడని ఆయన విమర్శించారు. భవిష్యత్తులో కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న విధానాలపైన తెలుగు రాష్ట్రాలలో ఇక్కడి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై పెద్ద ఎత్తున కమ్యూనిస్టులు ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు .ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యుడు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య,సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు,జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి,మండల కార్యదర్శి నర్రగిరి,ఏఐటియుసి మండల కార్యదర్శి గిలక రాజు,నరేష్ నాయక్,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతిలో చేరిన పలువురు నాయకులు



**దామరగిద్ద,ఏప్రిల్07(సూర్య రేఖ):** నారాయణపేట్ నియోజకవర్గం దామర్‌గిద్ద మండలం సాకలోనిపల్లి గ్రామంలో తెలంగాణ జాగృతి పార్టీ ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమంను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వెంకటేష్,సురేష్,నరేష్ ల ఆధ్వర్యంలో సుమారు 75 మంది యువకులు,వార్డ్ మెంబర్లు తెలంగాణ జాగృతి పార్టీలో చేరారు.తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాధరంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.."కవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పార్టీ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుంది" అని తెలిపారు.అలాగే తెలంగాణ జాగృతి పార్టీని జిల్లాలో మరింత బలపరచాలని,నారాయణపేట్ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్, ఉప సర్పంచ్ జి.శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.బాపన్‌పల్లి గ్రామానికి సర్పంచ్‌గా గవినోళ్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో వారికి ఘనంగా సన్మానం చేశారు.అదేవిధంగా,మర్యాదపూర్వకంగా కలిసి శ్రీనివాస్ గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్‌లు సన్మానం చేశారు.అలాగే ఈ కార్యక్రమంలో మొత్తం 75 మంది సభ్యులను పార్టీలోకి సాధరంగా ఆహ్వానించి చేర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట్ జిల్లా జాగృతి నాయకులు సంకల్పూర్ చంద్రు,కొత్తపల్లి మండలం గోకుల్ నగర్ మాజీ ఎంపీటీసీ, జాగృతి నాయకులు నీలి జనార్దన్,అలాగే బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎ.వెంకటేష్,బి.సురేష్,రాజేష్,అంబేద్కర్, సురేష్ కుమార్,ప్రసాద్ కృష్ణ,నరేష్,ఈ.అంబేద్కర్,బి.లక్ష్మణ్,నారాయణగౌడ్, ఈ.రాములు,డి.రాజశేఖర్,మల్లేశ్ రాథోడ్,శ్రీను రాములు,ఈ.అంబేద్కర్,బి. శంకర్ ,కృష్ణ కుమార్,మల్లేశ్,లక్ష్మణ్,కె.లాల్,విజయ్,అంబేద్కర్,పెద్ద అంబేద్కర్, చిన్న అంబేద్కర్,ఎల్. అంబేద్కర్,బాలు, ఆదిత్య,సతీష్,ఈ. అనిల్,సతీష్, మల్లేశ్ అంబేద్కర్,మహేష్,కె.లాలు,జి.అంజి రాములు,మల్లేశ్, శ్రీనివాస్,ఎన్. శ్రీను,బి.ప్రభు,మల్లేష్,జి.అఖిల్ తదితరులు ఉన్నారు.

## పండిత్ దీన దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్-



**శివంపేట,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ శివ్వంపేట మండల అధ్యక్షులు పెద్దపులి రవి అధ్యర్యంలో నిర్వహించినటువంటి పండిత్ దిన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ 2026 తరగతులకు ముఖ్యఅతిథిగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ రావడం జరిగింది.జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ...జనసంగ్ నుండి మొదలుకొని భారతీయ జనతా పార్టీగా పేర్కొని భారత ప్రధాని అవ్వడం మన పార్టీకి గర్వకారణం.. అదేవిధంగా పార్టీ కోసం ఎందరో మహనీయుల గొప్ప పనులను గుర్తు చేసుకోవాసిన సమయమిది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఎన్నో పథకాల ద్వారా గ్రామాల నుండి దేశ వ్యాప్తంగా అభివృధి జరుగుతుంది అని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్,జిల్లా కార్యదర్శి సాధుల,అశోక్,భిక్షపతి,అల్లీపూర్ సర్పంచ్ కుమార్,వార్డు సభ్యులు బోధనం రమేష్,బీజేపీ నాయకులు సద్గుల నర్సారెడ్డి,వినోద్ సంజీవ్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం..

**మంత్రి చేతులమీదుగా అవార్డు అందుకున్న డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి.**




**కామారెడ్డి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆసుపత్రులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.ఈ క్రమంలో,ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యధిక కాన్పులు నిర్వహించిన కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఆసుపత్రి ఉత్తమ ఆసుపత్రిగా ఎంపిక చేయబడిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా డిసిహెచ్ ఎస్ డా.విజయ భాస్కర్ రెడ్డి,ఆసుపత్రి సుపరేండెంట్ అవార్డు అందుకున్నారు.

## ఉత్తమ ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆసుపత్రులు, వైద్య సిబ్బందిని ఘనంగా సత్కరించిన ప్రభుత్వం






**మందమర్రి,ఏప్రిల్ 07(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య సేవల మెరుగుదల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మరొకసారి గుర్తింపు లభించింది.రాష్ట్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా వైద్య రంగానికి చెందిన నిపుణులు,అధికారులు,సిబ్బంది సమక్షంలో వైభవంగా సాగాయి.ఈ సందర్భంగా ఎన్.క్యూ.ఎ.ఎస్ కింద ఉత్తమ ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆసుపత్రులు,వైద్య సిబ్బందిని ప్రభుత్వం ఘనంగా సత్కరించింది.ఈ అవార్డుల్లో భాగంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ 100పడకల ఆసుపత్రి విశేష ప్రతిభ కనబరిచింది.అక్కడి మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ రవికుమార్ అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలకు గాను ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు.బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తక్కువ వనరులతోనూ ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు,శిశువులకు అందిస్తున్న సేవలు, అత్యవసర చికిత్సల్లో చూపుతున్న చురుకుదనం, రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం వంటి అంశాల్లో ఆసుపత్రి విశేష పురోగతి సాధించింది.ఆసుపత్రిలో అమలు చేస్తున్న నాణ్యత ప్రమాణాలు, సిబ్బంది క్రమశిక్షణ, రోగి సేవా దృక్పథంతో ఈ అవార్డు అందుకోవడం ద్వారా బెల్లంపల్లి ఆసుపత్రి రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలోనూ గుర్తింపు పొందే దిశగా ముందడుగు వేసింది.డాక్టర్ రవికుమార్ నాయకత్వంలో ఆసుపత్రి సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచడమే లక్ష్యంగా నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.బెల్లంపల్లి ఆసుపత్రి సాధించిన ఈ విజయంతో ఇతర ఆసుపత్రులకు ప్రేరణ లభిస్తుందని పేర్కొన్నారు.ఈ గౌరవం జిల్లా వైద్య సిబ్బందికి మరింత ఉత్సాహాన్ని నింపగా, భవిష్యత్తులో ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.మొత్తం మీద,ఈ అవార్డు బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కృషికి ప్రతిఫలం మాత్రమే కాకుండా,ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరచే ఘట్టంగా నిలిచింది.

## బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన తోకల శ్రీనివాస్ రెడ్డి

**అందర్నీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..**
**పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**





**రాజేంద్రనగర్,ఏప్రిల్07(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ నాయకత్వంపై ప్రజలు పూర్తి విశ్వాసంగా ఉన్నారని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కేంద్రంలో ప్రధాని మోడీ ప్రభుత్వం దేశం కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా వాటిని అమలు చేయడం జరుగుతుందన్నారు.రాష్ట్రంలోనూ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తూ పార్టీ బలోపేతానికి దృష్టి పెడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.తనకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు అప్పగించడంతో ఆయన రామచందర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ పార్టీ తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యతను అప్పగించినందుకు రామచందర్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీని బూత్ స్థాయి నుంచి సంస్థాగతంగా పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.2028 సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారమే లక్ష్యంగా సమిష్టిగా అందర్నీ కలుపుకొని అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.దేశ ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలకు వివరించి పేద కుటుంబాలకు లబ్ధి చేకూరే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ఎజెండా..

**రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి**




**రాజేంద్రనగర్,ఏప్రిల్07(సూర్యరేఖ)** ప్రజా సమస్యల పరిష్కారమే భారత కమ్యూనిస్టు పార్టీ పని చేయడం జరుగుతుందని మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాజేంద్రనగర్ మండల కేంద్రంలోని రాజేంద్రనగర్ ప్రాంతంలో పోరాటాల పార్టీ సిపిఐకి చేయూతనివ్వాలంటూ ఏప్రిల్ ఒకటి నుండి పది వరకు చేపట్టిన ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.అందులో భాగంగా ఇంటింటికి తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకుంటూ బస్తీలలో దోమల బెడద విపరీతంగా ఉందని,బస్తీవాసులు వారి దృష్టికి తీసుకువచ్చారు.తక్షణమే దోమల నివారణ చర్యలు చేపట్టాలని,చిన్నపిల్లలు,వృద్ధులు డెంగ్యూ,మలేరియా,విష జ్వరాల భారీన పడే ప్రమాదం ఉందని తక్షణం దోమల మందు బస్తీలలో కొట్టాలని వారన్నారు.తక్షణమే వీటన్నింటిని పరిష్కరించాలని వారు అన్నారు.ఇంటింటికి కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల కేంద్రంలోని రాజేంద్రనగర్ ప్రాంతంలో విరాళంగా రూ.4260 సేకరించారు.సుమారు 150 కుటుంబాలను వ్యాపారస్తులను కలిశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యాలయం కార్యదర్శి జి సత్యం,భారత జాతీయ మహిళా సమాఖ్య మండల అధ్యక్షులు మునీశ్వరి,మండల ఉపాధ్యక్షులు కుకునూరు వాణి,మండల కౌన్సిల్ సభ్యులు జ్యోతి,ఊర్మిళ,బుజ్జి,గంగారం కృష్ణ,సుధాకర్,కైలాసమ్మ,జిలాని,సతీష్,రాజు,అఖిల భారత యువజన సమాఖ్య మండల నాయకురాలు నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,